MAHANAGAR DINAPATRIKA

మహానగర్

విజయవాడ | సంపుటి : 10 | సంచిక : 300 | పేజీలు : 8 | సోమవారం 19 అక్టోబర్ 2026 | వెల : 6-00



ఓట్ల చోరీకి పాల్పడుతున్న వారికి శిక్ష తప్పదు

- ఓటు చోరీకి మోదీ ప్లాన్.. అమిత్ షా అమలు
- సీఈసీ ద్వారా కార్యరూపం
- గోవాలోని మర్గావ్‌లో జరిగిన కాంగ్రెస్ గోయ్ రఖోన్ యాత్రలో రాహుల్ గాంధీ
- కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ రాజ్యాంగాన్ని పరిరక్షించే శక్తి
- ఎట్టి పరిస్థితుల్లోనూ మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్‌లను వదిలిపెట్టేది లేదు

సౌదీ అరేబియాలోని భారతీయులకు అలర్ట్

- భద్రతా నిబంధనలు పాటించాలంటూ ఆదేశం
- హౌతీ తిరుగుబాటుదారుల దాడులతో సౌదీలోని భారతీయ కార్యాలయం అడ్వైజరీని జారీ

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే

కఠిన చర్యలు



- ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యం
- కుల, మత విద్వేషాలకు తావులేదు..
- అనుమతులు లేకుండా సభలు, ఊరేగింపులు నిర్వహించరాదు
- ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించడమే లక్ష్యం
- కుల, మత, భాషల పేరుతో ఓట్లు అడగరాదు
- ఆలయాలు, మసీదులు, చర్చిలను ప్రచార వేదికలుగా వాడొద్దు

అమరావతి, మహానగర్

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల సంఘం ప్రవర్తనా నియమావళిని అమల్లోకి తీసుకొచ్చింది. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు, వారి అనుచరులు, రాజకీయ పార్టీల నాయకులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు నియమావళి అమల్లో ఉంటుందని, ఉల్లంఘనలకు పాల్పడకుండా అందరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. ఎన్నికల ప్రచారంలో కులాలు, మతాలు, భాషలు, ప్రాంతాల పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించకూడదు. కులం, మతం, జాతి ప్రాతిపదికన ఓట్లు అభ్యర్థించరాదు. ఆలయాలు, మసీదులు, చర్చిలు వంటి ప్రార్థనా స్థలాలను ప్రచార వేదికలుగా ఉపయోగించకూడదు. ప్రత్యర్థి అభ్యర్థుల వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అంశాలను అనవసరంగా ప్రస్తావించరాదని, నిర్ధారణ కాని ఆరోపణలు చేయకూడదని నియమావళి స్పష్టం చేస్తోంది. ప్రైవేటు ఆస్తులపై యజమాని అనుమతి లేకుండా పార్టీ జెండాలు, పోస్టర్లు ఏర్పాటు చేయడం, గోడలపై నినాదాలు రాయడం నిషేధం. అనుమతితో ప్రచార సామగ్రి ఏర్పాటు చేసినప్పుడు నిబంధనల ప్రకారం సంబంధిత ఎన్నికల అధికారికి వివరాలు అందించాలి. ఇతర పార్టీలు ఏర్పాటు చేసిన జెండాలు, పోస్టర్లు తొలగించడం లేదా ధ్వంసం చేయడం చేయరాదు. ప్రచార కరపత్రాలు, పోస్టర్లు, ఇతర ముద్రిత సామగ్రిపై ప్రచురణకర్త పేరు, చిరునామా తప్పనిసరిగా ఉండాలి. రాజకీయ పార్టీలు నిర్వహించే సభలు, సమావేశాలు, ఊరేగింపులకు సంబంధిత అధికారుల అనుమతి తీసుకోవాలి. ఒకే ప్రాంతంలో ఒకే సమయంలో వేర్వేరు పార్టీలు సభలకు అనుమతి కోరితే, నిబంధనల ప్రకారం ముందుగా దరఖాస్తు చేసుకున్నవారికి ప్రాధాన్యం ఉంటుంది. ఇతర పార్టీల సభలకు ఆటంకం కలిగించడం, ప్రత్యర్థుల ఇళ్ల వద్ద నిరసనలు, పికెటింగ్‌లు నిర్వహించడం వంటివి చేయరాదు. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఎన్నికల ప్రచారం చేయరాదు. ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తరలించేందుకు వాహనాలు ఉపయోగించడంపై ఎన్నికల నిబంధనలు వర్తిస్తాయి. లౌడ్‌స్పీకర్ల వినియోగానికి అనుమతి - మిగతా 2లో

మా తీర్పు కాగితాలకే పరిమితం కావాలా?



- రుతుక్రమ ఆరోగ్యంపై రాష్ట్రాల నిర్లక్ష్యం
- సుప్రీం కోర్టు సీరియస్
- రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద రుతుక్రమ ఆరోగ్యాన్ని ప్రాథమిక హక్కుగా గుర్తించిన చారిత్రాత్మక తీర్పు అమలుపై రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నిర్లక్ష్యంపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం 5

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

- స్థానిక ఎన్నికల్లో అడ్డంకులు.. గవర్నర్‌కు వైసీపీ అధినేత ఫిర్యాదు
- నామినేషన్ల ప్రక్రియపై అభ్యంతరాలు.. కేంద్ర బలగాల పర్యవేక్షణలో ఎన్నికలు జరపాలని విజ్ఞప్తి
- వైసీపీ అభ్యర్థులను అడ్డుకుంటున్నారు.. పోలీసుల తీరుపై జగన్ ఆరోపణలు
- పులివెందులలో 36 వార్డులకు 19 నామినేషన్లే.. పరిస్థితిపై జగన్ ఆందోళన
- ఓటమి భయంతోనే అప్రజాస్వామిక చర్యలు



అమరావతి, మహానగర్

రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌ను కోరారు. ఆదివారం ఆయన రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యారు. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార కూటమి అప్రజాస్వామిక పద్ధతులకు పాల్పడుతోందని, ప్రతిపక్ష అభ్యర్థులను నామినేషన్లు వేయకుండా అడ్డుకుంటున్నారని గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. సమావేశం అనంతరం జగన్ మీడియాలో మాట్లాడుతూ, రాష్ట్రంలో ఇంతటి అప్రజాస్వామిక వాతావరణాన్ని తానెప్పుడూ - మిగతా 2లో

భవానీ నామస్మరణతో

మార్మోగిన ఇంద్రకీలాద్రి



- దుర్గాదేవిగా శ్రీ కనకదుర్గమ్మ
- ఘనంగా ఆదిదంపతుల నగరోత్సవం
- 450 మంది వేదపండితులకు ఘన సత్కారం
- దుర్గా ఘాట్‌లో హంస వాహనం ట్రయల్ రన్
- భక్తుల సౌకర్యాలు, భద్రతపై కలెక్టర్, పోలీస్ కమిషనర్ ప్రత్యేక పర్యవేక్షణ
- అమ్మవారిని దర్శించుకున్న మంత్రి కొలుసు పార్థసారథి

2



సీఈసీని ఎవరూ కాపాడలేరు

- వెంటనే సర్‌ను నిలిపివేయాలి
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాల్సిందే
- ఎన్నికల సంఘం వ్యవస్థలో సమూల మార్పులు చేపట్టాలని కాంగ్రెస్ మరోసారి డిమాండ్

5

ఎన్నికల హింసపై నిష్పాక్షిక విచారణ జరిపిస్తాం

- ప్రజాస్వామ్యంపై మీరు నీతులు చెప్పడమా?
- జగన్‌పై మంత్రి అచ్చెన్నాయుడు విమర్శలు
- 2021 స్థానిక ఎన్నికల్లో జరిగిన దాడులకు జగన్ సమాధానం చెప్పాలని డిమాండ్
- నిమ్మగడ్డ రమేశ్ కుమార్ పదవీకాలం తగ్గింపు ఆర్డినెన్స్‌ను గుర్తు చేసిన మంత్రి
- బెదిరింపుల వల్లే నాడు ఎన్నికలను బహిష్కరించాల్సి వచ్చిందని వెల్లడి

అమరావతి, మహానగర్

ప్రజాస్వామ్యం గురించి నేడు మాట్లాడుతున్న జగన్, వారి హయాంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల అరాచకాలకు ముందుగా సమాధానం చెప్పాలని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ.. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రతిపక్షాలపై జరిగిన దాడులను, ప్రజాస్వామ్య ఉల్లంఘనలను గుర్తు చేస్తూ జగన్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "నేడు ప్రజాస్వామ్యం గురించి, - మిగతా 2లో



మహానగర్

భవానీ నామస్మరణతో మార్మోగిన ఇంద్రకీలాద్రి













విజయవాడ, మహానగర్‌ంం

శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఆదివారం శ్రీ దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చిన శ్రీ కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి వచ్చిన భవానీ భక్తులతో ఇంద్రకీలాద్రి కిక్కిరిసింది. భవానీ నామస్మరణతో కొండ మార్మోగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దర్శన క్యూలైన్ల నిర్వహణ, తాగునీరు, పాలు, మజ్జిగ, అన్నప్రసాదం పంపిణీ, ఉచిత క్లోక్‌రూమ్, పారిశుద్ధ్యం, భద్రత తదితర ఏర్పాట్లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మాలధారణ చేసిన భవానీ భక్తుల కోసం మహామండపం దిగువ భాగంలో నిరంతరం ప్రసాద పంపిణీతోపాటు దీక్షా విరమణకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ భక్తులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. భక్తులతో నేరుగా మాట్లాడి సమస్యలను తెలుసుకుని, వాటిని తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాలు, కమాండ్ కంట్రోల్ వ్యవస్థల ద్వారా పరిస్థితులను పర్యవేక్షిస్తూ, వృద్ధులు, మహిళలు, చిన్నారులు, దివ్యాంగులకు అవసరమైన సహాయం అందించేలా చర్యలు చేపట్టారు. దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.కె. శీనా నాయక్, పాలకమండలి చైర్మన్ బొర్రా రాధాకృష్ణ భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించి వివరాలను తెలియజేశారు. మరోవైపు, దసరా ఉత్సవాల్లో ఎనిమిదో రోజు ఆదివారం సాయంత్రం శ్రీ దుర్గాదేవి అలంకార దినాన్ని పురస్కరించుకుని శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వర స్వామివార్ల దివ్య నగరోత్సవం వైభవంగా నిర్వహించారు. మల్లేశ్వర స్వామివారి ఆలయం నుంచి ప్రారంభమైన ఊరేగింపు రథం సెంటర్, వన్‌టౌన్ వినాయక గుడి, కెనాల్ రోడ్డు, దుర్గా ఘాట్ మీదుగా ఘాట్ రోడ్డు మార్గంలో సాగింది. మేళతాళాలు, మంగళవాయిద్యాలు, కేరళ పంచవాద్యాలు, నాదస్వరాలు, మహిళల కోలాటాలు, జానపద కళాకారుల ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వేలాది మంది భక్తులు జయజయధ్వానాలు చేస్తూ, కర్పూర హారతులు సమర్పించి, కొబ్బరికాయలు కొట్టి ఆదిదంపతులకు నీరాజనాలు పలికారు. నగరోత్సవం అనంతరం ఆలయ రాజగోపురం వద్ద వేదపండితులు, అర్చకులు ఆస్థాన సేవ నిర్వహించారు. ఇదే సందర్భంగా దుర్గా ఘాట్‌లో హంస వాహనం (తెప్పోత్సవం) ట్రయల్ రన్ నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు, ఈవో వి.కె. శీనా నాయక్, స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ తదితరులు ఏర్పాట్లు, భద్రతా చర్యలను పరిశీలించారు. దుర్గాష్టమిని పురస్కరించుకుని శ్రీ మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో నిర్వహించిన వేదవిద్వత్ సభలో రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి కె. కన్నబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వేదాలు, ఉపనిషత్తులు భారతీయ సంస్కృతికి, ఆధ్యాత్మిక జీవనానికి మూలస్తంభాలని, వేదపారంపర్యాన్ని తరతరాలకు అందిస్తున్న పండితుల సేవలు అమూల్యమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 450 మంది ఘనపాఠీలు, క్రమపాఠీలు, వేదపండితులను శాలువాలు, అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అమ్మవారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని, రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ప్రార్థించినట్లు తెలిపారు. దసరా ఉత్సవాలకు తరలివచ్చే ప్రతి భక్తుడికి ప్రశాంతమైన, సౌకర్యవంతమైన దర్శనం కల్పించడమే లక్ష్యంగా దేవస్థానం, జిల్లా యంత్రాంగం, పోలీసు శాఖతోపాటు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు.

డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డికి పర్యావరణ మిత్ర పురస్కారం

గుంటూరు, మహానగర్

నగరంలో గత దశాబ్దకాలంగా 10 వేల మొక్కలను నాటి, సంరక్షిస్తున్న ప్రముఖ వైద్యులు డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డిని చేయూత ఫౌండేషన్ ఆధ్వర్యంలో పౌర సంస్థల ప్రతినిధులు పర్యావరణ మిత్ర పురస్కారంతో సత్కరించారు. ఆదివారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో నిర్వహించిన అభినందన సభకు చేయూత ఫౌండేషన్ కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ గుంటూరు నగరాన్ని హరితవనంగా మార్చేందుకు కృషి చేస్తున్న డాక్టర్ నరేంద్రరెడ్డికి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం అందించాలని కోరారు. శాసనమండలి మాజీ సభ్యుడు కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ శ్యామల నగర్, ఇన్నర్ రింగ్ రోడ్డులో సుమారు 15 కిలోమీటర్ల మేర మొక్కలు నాటి సంరక్షించడం అభినందనీయమన్నారు. వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతకు భూభాగంలో 33 శాతం అడవులు ఉండాల్సి ఉండగా, భారతదేశంలో



24 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 21 శాతం, గుంటూరు జిల్లాలో కేవలం ఏడు శాతం మాత్రమే ఉన్నాయని తెలిపారు. ఎవర్ గ్రీన్ ఎర్త్ ఫౌండేషన్ ద్వారా సుమారు రూ.50 లక్షలు వెచ్చించి, ఆరుగురు కార్మికులను నియమించుకుని ప్రతి నెలా రూ.లక్ష ఖర్చుతో మొక్కలను సంరక్షిస్తున్న డాక్టర్ నరేంద్రరెడ్డి సేవలను కొనియాడారు. అస్సాం వ్యవసాయ విశ్వవిద్యాలయం పూర్వ ప్రొఫెసర్ వై. రత్తయ్య మాట్లాడుతూ గ్రీన్ మైల్స్ కార్యక్రమం ద్వారా మోకాలి శస్త్రచికిత్స చేయించుకున్న ప్రతి ఒక్కరికీ మొక్కను అందించి నాటేలా ప్రోత్సహిస్తున్నారని పేర్కొన్నారు. డాక్టర్ నరేంద్రరెడ్డి మాట్లాడుతూ బి.ఎం.ఆర్. హెల్త్ ఎడ్యుకేషన్ సొసైటీ ద్వారా పేద విద్యార్థులకు సహాయం చేస్తున్నామని, ఉన్నతి హెల్త్ ఫౌండేషన్ ద్వారా గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పేదలకు ఉచితంగా మోకాలి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎవర్ గ్రీన్ ఎర్త్ ఫౌండేషన్ ద్వారా మొక్కల సంరక్షణకు చేస్తున్న కృషికి గుర్తింపుగా పర్యావరణ మిత్ర పురస్కారం అందుకోవడం తన బాధ్యతను మరింత పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్. మంజునాథ్, జలీల్ అహ్మద్, వజ్రాల వెంకట నాగిరెడ్డి, పోలూరి వీరారెడ్డి, తమ్మా ధనుంజయరెడ్డి, బషీర్ అహ్మద్, పి. సింగారావు, ఓరుగంటి నారాయణరెడ్డి, పి. రాఘవరావు, వల్లూరి సదాశివరావు, డి. తిరుపతిరెడ్డి, కల్లి శివారెడ్డి, బండి అశోక్‌రెడ్డి, మోదుగుల రవికృష్ణ, బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు. తొలుత అతిథులు డాక్టర్ నరేంద్రరెడ్డిని శాలువాతో సత్కరించి సన్మాన పత్రాన్ని అందజేశారు.

ఎన్నికల హింసపై నిష్పాక్షిక విచారణ జరిపిస్తాం

-మొదటిపేజీ తరువాయి

రాజ్యాంగం గురించి మాట్లాడుతున్న జగన్ గారిని నేను ఒకటే సూటిగా ప్రశ్నిస్తున్నాను. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో మీరు, మీ ప్రభుత్వం చేసిన అరాచకాలకు ముందు సమాధానం చెప్పండి. ఆ తర్వాతే ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు మీకు ఉంటుంది. ఆనాడు మాచర్లలో టీడీపీ నేతలు బోండా ఉమ, బుద్దా వెంకన్నల వాహనంపై మీ పార్టీ శ్రేణులు దాడి చేసినప్పుడు మీకు ప్రజాస్వామ్యం గుర్తుకురాలేదా? పుంగనూరులో జనసేన అభ్యర్థి నామినేషన్ పత్రాలు చించివేసినప్పుడు రాజ్యాంగం ఏమైంది? మీ ఐదేళ్ల పాలనలో టీడీపీ, జనసేన అభ్యర్థులను నామినేషన్లు కూడా వేయకుండా అడ్డుకున్నారని వచ్చిన వేలాది ఫిర్యాదులకు మీ దగ్గర సమాధానం ఉందా? వీటన్నిటికీ జవాబు చెప్పకుండా ఈరోజు మీరు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉంది. ఇప్పుడు ఎన్నికల సంఘం స్వతంత్రత గురించి మాట్లాడుతున్నారు కదా? మరి నాడు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా ఉన్న నిమ్మగడ్డ రమేశ్ కుమార్ పదవీకాలాన్ని తగ్గిస్తూ ఆర్డినెన్స్ ఎందుకు తీసుకొచ్చారు? ఆ చర్యను హైకోర్టు తప్పుబడుతూ కొట్టివేసిన విషయం మర్చిపోయారా? మీ హయాంలో బెదిరింపులు, బలవంతపు ఉపసంహరణల ద్వారా ఏకగ్రీవాలు చేసుకున్నప్పుడు ప్రజాస్వామ్యం ఏమైందో చెప్పాలి. మీ పార్టీ నాయకుల దాడులు, బెదిరింపులతో మా కార్యకర్తల ప్రాణాలు కాపాడుకోవడమే గగనమైంది. అందుకే, తప్పనిసరి పరిస్థితుల్లో మేము స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరించాల్సి వచ్చింది. ఈ విషయం మీరు మర్చిపోయినా, ప్రజలు మర్చిపోలేదు. మిథున్‌రెడ్డి ఘటనతో సహా అన్ని ఎన్నికల హింసాత్మక ఘటనలపై నిష్పాక్షిక దర్యాప్తు జరగాలని మేము డిమాండ్ చేస్తున్నాం. తప్పు ఎవరు చేసినా చట్టం ముందు అందరూ సమానమే. చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నాను" అని స్పష్టం చేశారు.

ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

-మొదటిపేజీ తరువాయి

తప్పనిసరి. అనుమతించిన సమయాల్లోనే వాటిని ఉపయోగించాలి. సాధారణంగా ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు లౌడ్‌స్పీకర్ల వినియోగానికి సంబంధించిన నిబంధనలు అమల్లో ఉంటాయి. అయితే స్థానిక ఎన్నికల సంఘం జారీ చేసిన తాజా ఆదేశాలే తుది ప్రమాణంగా ఉంటాయి.

నిబంధనలు పాటించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలి

ఎన్నికల్లో అవినీతి పద్ధతులు, బెదిరింపులు, అక్రమాలకు పాల్పడకుండా అభ్యర్థులు, రాజకీయ పార్టీలు సంయమనం పాటించాలి. ఎన్నికల సంఘం రూపొందించిన ప్రవర్తనా నియమావళిని పాటించడం ద్వారా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు సహకరించాలని అధికారులు సూచిస్తున్నారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అన్ని పార్టీలు బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.

ముంచుకొస్తున్న ఎల్‌నినో ముప్పు

ఎల్‌నినో తెలంగాణ రాష్ట్రంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతోంది. ఇటీవల కాలంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జలాశయాల్లోని భూగర్భ జలాలు క్రమంగా అడుగంటుతున్నాయి. సాధారణంగా వేసవిలో తలెత్తే నీటి సమస్య ఇప్పుడే ముంచుకొస్తోంది. రాబోయే రోజుల్లో ఈ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందనే అంచనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఉన్న పరిమితమైన నీటి వనరులను అవసరం మేరకు మాత్రమే వాడుకుని, నీటి వృథాను అరికట్టడం ద్వారా మాత్రమే ఈ గడ్డు పరిస్థితి నుంచి బయట పడగలం. ప్రభుత్వం సరఫరా చేస్తున్న తాగునీటిని ఇతర అవసరాలకు వాడొద్దని నిపుణులు సూచిస్తున్నారు. తాగునీటేతర అవసరాల కోసం శుద్ధిచేసిన మురుగు జలాలను వినియోగించాలని నిపుణులు సూచిస్తున్నారు. హైదరాబాద్ నగరం సహా ఇతర ప్రధాన నగరాల్లో అత్యాధునిక విధానాలతో మురుగునీటిని శుద్ధి చేస్తున్నారు. వాహనాలు, ఇంటి పరిసరాల శుభ్రత, గార్డెనింగ్ తదితర అవసరాల కోసం శుద్ధిచేసిన మురుగు జలాలను ఉపయోగించాలి. శుభ్రం చేసేందుకు కుళాయి నుంచి వచ్చే పైపులను వాడుతుంటారు. దీనివల్ల అధికంగా నీరు వృథా అవుతుంది. అందువల్ల తడివస్త్రంతో కారు శుభ్రం చేసుకోవడం మంచిది. బకెట్‌లో నీటిని వినియోగించి తడిగుడ్డతో శుభ్రంచేస్తే 20 లీటర్లు, అంతకంటే తక్కువ నీటితోనే సరిపెట్టేందుకు అవకాశం ఉంటుంది. వాహనాలను పైపుతో కడగటం కారణంగా వాటి మూలాల్లో నీరు నిలిచిపోయి తుప్పుపట్టే అవకాశం ఉంది. ఫలితంగా వాటి జీవితకాలం కూడా తగ్గిపోతుంది.

ప్రజాస్వామ్యాన్ని కాపాడండి

-మొదటిపేజీ తరువాయి



చూడలేదని అన్నారు. ఎన్నికల ప్రక్రియ మొత్తం కేంద్ర బలగాల పర్యవేక్షణలో, సీసీటీవీ కెమెరాల నిఘాలో జరిపేలా చూడాలని గవర్నర్‌ను కోరినట్లు తెలిపారు. వైసీపీ అభ్యర్థులను నామినేషన్ కేంద్రాల్లోకి వెళ్లకుండా అడ్డుకుంటున్నారని, అదే సమయంలో టీడీపీ మద్దతుదారులను లోపలికి అనుమతించి దాడులు చేయిస్తున్నారని గవర్నర్‌కు వివరించినట్లు చెప్పారు. ఈ అరాచకాలకు పోలీసులు కూడా అధికారపక్షానికే మద్దతుగా నిలుస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని 8 ప్రాంతాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదని, మరో 19 చోట్ల కేవలం 36 శాతం నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకో 8 ప్రాంతాల్లో వైసీపీ అభ్యర్థుల నామినేషన్ పత్రాలను చించివేశారని తెలిపారు. పులివెందులలో 36 వార్డులకు గాను కేవలం 19 నామినేషన్లు మాత్రమే దాఖలు కావడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద వైసీపీ ఎంపీలు అవినాశ్ రెడ్డి, మిథున్ రెడ్డి, గురుమూర్తి పట్ల వ్యవహరించిన తీరు, అభ్యర్థులపై పోలీసుల కాల్పులు, తప్పుడు కేసులు బనాయించడం వంటి అంశాలను కూడా గవర్నర్ దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. క్రియాశీలకంగా ఉన్న వైసీపీ కార్యకర్తలను భయపెట్టేందుకు బైండోవర్ కేసుల కుట్ర జరుగుతోందని జగన్ ఆరోపించారు. "ఓటమి భయంతోనే చంద్రబాబు ఇలాంటి అప్రజాస్వామిక చర్యలకు పాల్పడుతున్నారు. పోటీ చేయాలనుకునేవారికి అవకాశం ఇవ్వకపోవడం ప్రజాస్వామ్యానికి మాయని మచ్చ. దీనిపై న్యాయపరమైన మార్గాలతో సహా అన్ని అవకాశాలను అన్వేషిస్తాం" అని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణులు ధైర్యంగా పోరాడాలని, త్వరలోనే పరిస్థితులు మారతాయని ఆయన పిలుపునిచ్చారు.

ఈసీల నియామకంపై తప్పుచేశాం: పశ్చాత్తాపం వ్యక్తం చేసిన జగన్

కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ (సీఈసీ), ఇతర కమిషనర్ల నియామకం కోసం కేంద్ర ప్రభుత్వం 2023లో తీసుకొచ్చిన చట్టానికి అప్పట్లో మద్దతివ్వడం తాము చేసిన పెద్ద తప్పిదమని, అందుకు ఇప్పుడు చింతిస్తున్నామని జగన్ విచారం వ్యక్తం చేశారు. అధికారంలో ఉన్న పార్టీయే ఎన్నికల కమిషనర్లను నియమించే ప్రక్రియను నియంత్రించకూడదని, ఈ విధానంపై ఇప్పుడు పశ్చాత్తాపం చెందుతున్నామని ఆయన అన్నారు. అంతకుముందు ఎస్ఈసీ అనిల్ పునేఠాను కలిసిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ జగన్ ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. కేంద్రంలో అయినా, రాష్ట్రంలో అయినా ఎన్నికల కమిషనర్లను అధికార పార్టీ నామినేట్ చేయకూడదని జగన్ స్పష్టం చేశారు. "గతంలో కేంద్రంలో అధికార పార్టీయే ఎన్నికల కమిషనర్‌ను నామినేట్ చేసే విధానానికి వైసీపీ మద్దతు ఇచ్చింది. కానీ ఆ రోజు మేము చేసిన తప్పుకు ఇప్పుడు బాధపడుతున్నాం" అని ఆయన పేర్కొన్నారు. "పరీక్ష రాసే విద్యార్థే తనకు ఇన్విజిలేటర్‌ను నియమించుకున్నట్లుగా ఈ విధానం ఉంది. ఎంత నిజాయతీపరుడైన అధికారి అయినా, నియామకం నిష్పక్షపాతంగా జరగనప్పుడు విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తుంది" అని జగన్ అభిప్రాయపడ్డారు.

ప్రస్తుత నియామక పద్ధతిలో లోపాలున్నాయని జగన్ వివరించారు. ఈ విధానంలో ప్రధానమంత్రి, ఆయన నామినేట్ చేసిన మరో మంత్రికి రెండు ఓట్లు, ప్రతిపక్ష నేతకు ఒక ఓటు ఉంటుందని, దీంతో ప్రభుత్వానికి అనుకూలమైన వ్యక్తే కమిషనర్‌గా నియమితులవుతారని తెలిపారు. ఈ వ్యవస్థలో ఉన్న లోపాన్ని తాము తప్పు చేసిన తర్వాతే గ్రహించామని అన్నారు. ఎన్నికల వ్యవస్థ విశ్వసనీయతను కాపాడటానికి పాత పద్ధతినే పునరుద్ధరించాలని, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ), ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేతతో కూడిన కమిటీ ద్వారానే ఈసీలను నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. కమిటీలో సీజేఐ ఉండటం వల్ల నియామక ప్రక్రియ నిష్పక్షపాతంగా ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) నియామకంలో కూడా ఇదే తరహా సంస్కరణలు తీసుకురావాలని జగన్ కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు లేదా టీడీపీ ప్రభుత్వం ఎస్ఈసీని నియమించకూడదని ఆయన స్పష్టం చేశారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు వేయకుండా అధికార టీడీపీ కూటమి అడ్డుకుంటోందని ఆరోపిస్తూ, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠాను కలిసి ఫిర్యాదు చేసిన అనంతరం జగన్ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రస్తుత ఎస్ఈసీని ముఖ్యమంత్రి చంద్రబాబే నియమించారని, ఆయన ఆదేశాల మేరకే ఎస్ఈసీ పనిచేస్తున్నారని జగన్ ఆరోపించారు.

వెంటనే ఈసీ జోక్యం చేసుకోవాలి: జగన్

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అధికార తెలుగుదేశం పార్టీ దౌర్జన్యాలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ వైసీపీ అధినేత జగన్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్ చంద్ర పునేఠాకు ఫిర్యాదు చేశారు. ఆదివారం ఆయన ఎస్ఈసీ కార్యాలయానికి వెళ్లి ఈ మేరకు ఒక వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో తమ పార్టీ అభ్యర్థులను నామినేషన్లు కూడా వేయనివ్వకుండా టీడీపీ నేతలు, కార్యకర్తలు భౌతికంగా అడ్డుకుంటున్నారని జగన్ ఆరోపించారు. కొన్నిచోట్ల రిటర్నింగ్ అధికారులు ఉద్దేశపూర్వకంగానే నామినేషన్ పత్రాలు స్వీకరించడానికి నిరాకరిస్తున్నారని తెలిపారు. ఈ దౌర్జన్యాలకు పాల్పడుతున్న టీడీపీ గూండాలకు పోలీసులే పూర్తిస్థాయిలో సహకారం అందిస్తున్నారని జగన్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. నేటితో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల గడువు ముగుస్తున్న నేపథ్యంలో ఈసీ తక్షణమే జోక్యం చేసుకోవాలని కోరారు. నామినేషన్ల ప్రక్రియ సజావుగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న రిటర్నింగ్ అధికారులు, పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని జగన్ ఎన్నికల కమిషనర్‌ను కోరారు.

ఏపీలో రాష్ట్రపతి పాలన పెట్టండి

ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని వైసీపీ అధినేత జగన్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో రాజ్యాంగ యంత్రాంగం పూర్తిగా విఫలమైందని, ప్రజాస్వామ్యాన్ని అధికార పార్టీ ఖూనీ చేస్తోందని ఆదివారం ఆయన తీవ్రంగా ఆరోపించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కరవయ్యాయని, ముఖ్యమంత్రి చంద్రబాబు కనుసన్నల్లోనే రాష్ట్ర ఎన్నికల సంఘం పనిచేస్తోందని జగన్ విమర్శించారు. నామినేషన్ కేంద్రాల వద్ద టీడీపీ వర్గాలు మాటువేసి, వైసీపీ అభ్యర్థులను దౌర్జన్యంగా అడ్డుకుంటున్నాయని మండిపడ్డారు. కేవలం రెండు రోజుల ముందు రిజర్వేషన్లు ప్రకటించి, 24 గంటల్లో నామినేషన్లు వేయమనడం ప్రతిపక్షానికి సమయం ఇవ్వకూడదనే కుట్రలో భాగమేనని ఆరోపించారు. గతంలో తమ ప్రభుత్వ హయాంలో ఎస్ఈసీగా నిమ్మగడ్డ రమేశ్ కుమార్ ఉన్నప్పుడు కలెక్టర్లు, ఎస్పీలను బదిలీ చేసినా తాము ధైర్యంగా ఎన్నికలకు వెళ్లి విజయం సాధించామని జగన్ గుర్తుచేశారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వానికి ఆ ధైర్యం లేదని విమర్శించారు. అన్నమయ్య జిల్లా పుంగనూరులో జరిగిన ఘర్షణల నేపథ్యంలో ఈ వివాదం మరింత ముదిరింది. వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి తన పార్టీ అభ్యర్థులతో నామినేషన్ వేయడానికి వెళ్లినప్పుడు టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య తీవ్ర ఘర్షణలు చెలరేగాయి. ఈ హింసకు వైసీపీనే కారణమని టీడీపీ ఆరోపిస్తుండగా, తమ ఎంపీపైనే దాడి జరిగిందని వైసీపీ ప్రత్యారోపణలు చేస్తోంది. అయితే, నిబంధనలకు విరుద్ధంగా ఎంపీ మిథున్ రెడ్డి వందలాది మంది అనుచరులతో రావడం వల్లే ఉద్రిక్తత తలెత్తిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలపై ఇరు పార్టీల నేతలు రాష్ట్ర ఎన్నికల సంఘానికి పరస్పరం ఫిర్యాదులు చేసుకున్నాయి. ఈ ఆరోపణలపై ఈసీ నివేదికలు కోరినట్లు సమాచారం.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

విజయవాడ, మహానగర్

జిల్లాలో పట్టణ స్థానిక సంస్థల సాధారణ ఎన్నికల్లో భాగంగా వార్డు సభ్యుల స్థానాలకు మొత్తం 1,783 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆదివారం నాటికి జిల్లాలోని ఐదు పట్టణ స్థానిక సంస్థల్లో 222 వార్డులకు నామినేషన్ల ప్రక్రియ పూర్తయింది. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌లో 86 వార్డులకు 958 నామినేషన్లు, తిరువూరు మున్సిపాలిటీలో 28 వార్డులకు 187, కొండపల్లి మున్సిపాలిటీలో 40 వార్డులకు 203, నందిగామ మున్సిపాలిటీలో 32 వార్డులకు 169, జగ్గయ్యపేట మున్సిపాలిటీలో 36 వార్డులకు 256 నామినేషన్లు దాఖలయ్యాయి. రాజకీయ పార్టీల వారీగా తెలుగుదేశం పార్టీ (టీడీపీ) నుంచి అత్యధికంగా 670 నామినేషన్లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి 520, జనసేన నుంచి 227, స్వతంత్ర అభ్యర్థుల నుంచి 178, భారతీయ జనతా పార్టీ (బీజేపీ) నుంచి 81, కాంగ్రెస్ నుంచి 42, సీపీఐ (ఎం) నుంచి 16, బీఎస్పీ నుంచి ఐదు, సీపీఐ నుంచి 42, ఇతర పార్టీల నుంచి 10 నామినేషన్లు నమోదయ్యాయి. ఎన్సీపీ నుంచి ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఈ వివరాలతో కూడిన నివేదికను విడుదల చేశారు.

అగ్రిగోల్డ్ బాండ్ల పరిశీలన తేదీల్లో మార్పు

విజయవాడ, మహానగర్

దసరా సెలవుల నేపథ్యంలో అగ్రిగోల్డ్ డిపాజిటర్లు, ఏజెంట్ల ఒరిజినల్ బాండ్ల పరిశీలన తేదీల్లో మార్పులు చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయం ఆదివారం ప్రకటించింది. ప్రభుత్వం అక్టోబర్ 19, 20 తేదీలను దసరా సెలవులుగా ప్రకటించినందున అక్టోబర్ 21 నుంచి బాండ్ల పరిశీలన ప్రక్రియను తిరిగి ప్రారంభించనున్నట్లు వెల్లడించింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రాంతీయ సీఐడీ విజయవాడ కార్యాలయంలో ఈ ప్రక్రియ కొనసాగుతుందని తెలిపింది. కానూరు, పెనమలూరులోని తులసి నగర్ మూడో రోడ్డులో, రియా ఆర్థోపెడిక్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి సమీపంలో ఉన్న సీఐడీ కార్యాలయానికి అగ్రిగోల్డ్ బాధితులు, డిపాజిటర్లు, లబ్ధిదారులు, ఏజెంట్లు తమ ఒరిజినల్ బాండ్లతో రావాలని సూచించింది. మండలాల వారీగా బాండ్ల స్వీకరణ షెడ్యూల్‌ను ప్రకటించింది. అక్టోబర్ 21, 22 తేదీల్లో తిరువూరు మండలం, 23, 24 తేదీల్లో విస్సన్నపేట మండలం, 26, 27 తేదీల్లో మైలవరం మండలానికి సంబంధించిన బాండ్లను పరిశీలనకు స్వీకరించనున్నట్లు పేర్కొంది. మిగిలిన మండలాల బాండ్ల స్వీకరణ తేదీలను తదుపరి పత్రికా ప్రకటన ద్వారా తెలియజేస్తామని అధికారులు వెల్లడించారు. కావున సంబంధిత డిపాజిటర్లు, లబ్ధిదారులు, ఏజెంట్లు తమకు కేటాయించిన తేదీల్లో సీఐడీ కార్యాలయానికి హాజరై బాండ్ల పరిశీలన ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.

బ్రాండ్ల కోసం మెటా కొత్త ఫెస్టివ్ ప్లేబుక్

విజయవాడ, మహానగర్



భారతదేశంలో పండుగల షాపింగ్‌ను ఐదు నెలల పాటు కొనసాగే వ్యాపార అవకాశంగా మలిచేందుకు మెటా 'ఫెస్టివ్ యాక్సిలరేటర్ 2026: సీఈఓ ప్లేబుక్'ను రూపొందించింది. వినియోగదారుల షాపింగ్ ధోరణులు మారుతున్న నేపథ్యంలో బ్రాండ్‌లు పండుగల సీజన్ ప్రారంభం నుంచే డిమాండ్‌ను పెంచుకొని, కొనుగోళ్లను అమ్మకాలుగా మార్చుకునేలా ఈ వ్యూహాత్మక మార్గదర్శిని సహాయపడనుంది. ఆన్‌లైన్‌లో తొలిసారిగా షాపింగ్ చేస్తున్న వారిలో 60 శాతం మంది టైర్-2, టైర్-3 నగరాలకు చెందినవారు కాగా, కొనుగోళ్లకు ముందు 86 శాతం మంది సోషల్ మీడియా ద్వారా ఉత్పత్తుల గురించి తెలుసుకుంటున్నారని నివేదిక వెల్లడించింది. పండుగల సమయంలో 85 శాతం మంది వినియోగదారులు ప్రతి వారం మెటా ప్లాట్‌ఫారమ్‌లను ఉపయోగిస్తున్నారు. కొత్త ఉత్పత్తులను అన్వేషించేందుకు, షాపింగ్ ఆలోచనలు పొందేందుకు 80 శాతం మంది ఏఐని ఆశ్రయిస్తున్నారు. మెటా ప్లాట్‌ఫారమ్‌లలో పండుగలకు సంబంధించిన కంటెంట్ సృష్టి 50 శాతం పెరుగుతుండగా, సోషల్ మీడియా ఎంగేజ్‌మెంట్ 20 శాతం అధికమవుతోంది. కంటెంట్ క్రియేటర్లు, ఏఐ ఆధారిత ప్రకటనలు, వాట్సాప్ మార్కెటింగ్ వంటి సాధనాలను సమన్వయం చేసుకోవాలని ప్లేబుక్ సూచించింది. దీపావళితోపాటు వివాహాల సీజన్, క్రిస్మస్, ఏడాది ముగింపు, గణతంత్ర దినోత్సవ విక్రయాలను లక్ష్యంగా చేసుకొని నిరంతర ప్రచార వ్యూహాలను అమలు చేయాలని పేర్కొంది.

ఐడీబీఐ బ్యాంక్ నికర లాభం రూ.2,205 కోట్లు

విజయవాడ, మహానగర్

ఐడీబీఐ బ్యాంక్ 2026--27 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రూ.2,205 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత త్రైమాసికంలో నమోదైన రూ.2,115 కోట్లతో పోలిస్తే ఇది 4 శాతం అధికం. ఇదే సమయంలో నిర్వహణ లాభం 33 శాతం పెరిగి రూ.2,893 కోట్లకు చేరింది. గత ఏడాది రెండో త్రైమాసికంలో ఎన్ఎస్‌డీఎల్ వాటా విక్రయం ద్వారా వచ్చిన రూ.1,699 కోట్ల అసాధారణ లాభాన్ని మినహాయిస్తే, ప్రస్తుత త్రైమాసికంలో నిర్వహణ లాభం వార్షిక ప్రాతిపదికన 59 శాతం, నికర లాభం 14 శాతం వృద్ధి చెందాయి. బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం గత ఏడాది ఇదే త్రైమాసికంలోని రూ.3,285 కోట్ల నుంచి 29 శాతం పెరిగి రూ.4,228 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ 3.71 శాతం నుంచి 4.11 శాతానికి పెరిగింది. సెప్టెంబరు 30, 2026 నాటికి బ్యాంక్ మొత్తం వ్యాపారం 18 శాతం వృద్ధితో రూ.6,27,216 కోట్లకు చేరింది. మొత్తం డిపాజిట్లు 17 శాతం పెరిగి రూ.3,55,684 కోట్లకు, నికర అడ్వాన్సులు 18 శాతం పెరిగి రూ.2,71,533 కోట్లకు చేరాయి. స్థూల నిరర్థక ఆస్తుల నిష్పత్తి 2.65 శాతం నుంచి 2.12 శాతానికి, నికర నిరర్థక ఆస్తుల నిష్పత్తి 0.21 శాతం నుంచి 0.17 శాతానికి తగ్గాయి. మూలధన సమృద్ధి నిష్పత్తి 27.10 శాతానికి పెరిగింది.

25వ డివిజన్ వైసీపీ అభ్యర్థిగా కావాటి దామోదర్ నామినేషన్





విజయవాడ, మహానగర్

తూర్పు నియోజకవర్గంలోని 25వ డివిజన్‌కు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా కావాటి దామోదర్ నామినేషన్ దాఖలు చేశారు. ఆదివారం ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

దిగ్విజయంగా విజయవాడ ఉత్సవ్ 2.0









కేశినేని చిన్ని కృషిని ప్రశంసించిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్

ఉత్సవ్ వేదికపై దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావుకు ఘన సత్కారం

అత్యద్భుతంగా సాంస్కృతిక ప్రదర్శనలు

విజయవాడ, మహానగర్

పున్నమిఘాట్, సింగ్‌నగర్‌లోని మాకినేని బసవపున్నయ్య (ఎంబీకే) స్టేడియం వేదికలుగా నిర్వహిస్తున్న విజయవాడ ఉత్సవ్ 2.0కు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. కళా ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, జాతీయ సరస్ మేళాతో ఉత్సవ ప్రాంగణాలు సందడిగా మారాయి. విజయవాడ ఎంపీ, ఉత్సవాల అధ్యక్షుడు కేశినేని శివనాథ్ (చిన్ని), కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ప్రముఖ దర్శకుడు కె. రాఘవేంద్రరావు తదితరులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ కేశినేని చిన్ని కృషితో జాతీయ సరస్ మేళా విజయవాడకు రావడం, వివిధ రాష్ట్రాల మహిళా స్వయం సహాయక సంఘాలు, కళాకారులు, చేతివృత్తుల నిపుణులకు తమ ఉత్పత్తులను ప్రదర్శించేందుకు అవకాశం లభించడం అభినందనీయమన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 1,500 మంది కళాకారులు, చేతివృత్తుల నిపుణులు ఈ మేళాలో పాల్గొంటున్నారని తెలిపారు. కళలు ప్రాంతాలకు ఆత్మ వంటివని, సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు ఇలాంటి ఉత్సవాలు దోహదపడతాయని పేర్కొన్నారు. విజయవాడతో తనకు ప్రత్యేక అనుబంధం ఉందని దర్శకేంద్రుడు కె. రాఘవేంద్రరావు తెలిపారు. విజయవాడలో జన్మించడం తన అదృష్టమని, ఉత్సవ్ వేదికపై సత్కారం అందుకోవడం ప్రత్యేక అనుభూతినిచ్చిందని చెప్పారు. పెమ్మసాని చంద్రశేఖర్ హీరోగా, నిర్మాతగా ముందుకొస్తే ఆయనతో సినిమా తీసేందుకు సిద్ధమని ప్రకటించారు. బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వివిధ ప్రాంతాల ప్రజలు ఒకచోట చేరి కళలు, సంస్కృతిని ఆస్వాదించేలా విజయవాడ ఉత్సవ్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎంపీ కేశినేని చిన్ని మాట్లాడుతూ మహిళలు, ముఖ్యంగా స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదిగి స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యంతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దుర్గమ్మ భక్తిభావం, నారీశక్తి, సాంస్కృతిక వైభవం కలగలిసిన విజయవాడ ఉత్సవ్ నగరానికి ప్రత్యేక గుర్తింపును తీసుకొస్తోందని వక్తలు పేర్కొన్నారు. కళా ప్రదర్శనలు, జాతీయ సరస్ మేళా, వివిధ రాష్ట్రాల సంప్రదాయాల ప్రదర్శనలతో విజయవాడ ఉత్సవ్ 2.0 ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది.

జాతీయ సరస్ మేళాకు విశేష స్పందన

- మహిళా సంఘాల ఉత్పత్తులకు అపూర్వ ఆదరణ.. రూ.3.50 కోట్ల వ్యాపారం
- రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు
- కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్



విజయవాడ, మహానగర్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళాకు సందర్శకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ఆదివారం సెలవు దినం కావడంతో వేలాది మంది మేళాను సందర్శించారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)తో కలిసి మేళాలోని వివిధ స్టాళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఢిల్లీ వెలుపల తొలిసారిగా విజయవాడలో ఇంత భారీ స్థాయిలో సరస్ మేళా నిర్వహించడం గర్వకారణమన్నారు. సందర్శకులు, వ్యాపారులకు కల్పిస్తున్న సౌకర్యాలు, డిజిటల్ చెల్లింపుల కోసం వైఫై కనెక్టివిటీ, పారిశుధ్య నిర్వహణను పరిశీలించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో సందర్శకుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. దేశవ్యాప్తంగా వచ్చిన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యుల ఉత్పత్తులకు మంచి మార్కెట్ లభించేలా, వారి జీవనోపాధి మెరుగుపడేలా సహకరిస్తామని స్పష్టం చేశారు. డిజిటల్ చెల్లింపుల్లో ఎదురవుతున్న వైఫై సమస్యలను పరిష్కరించడంతోపాటు పారిశుధ్యాన్ని మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. మేళాలో పాల్గొంటున్న మహిళా సంఘాలకు, నిర్వాహకులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సెర్ప్ డైరెక్టర్ (అడ్మిన్) కళ్యాణ చక్రవర్తి మాట్లాడుతూ ఇప్పటివరకు సరస్ మేళాలో సుమారు రూ.3.50 కోట్ల వ్యాపారం జరిగినట్లు వెల్లడించారు. దేశవ్యాప్తంగా 32 రాష్ట్రాలకు చెందిన మహిళా స్వయం సహాయక సంఘాలు, కళాకారుల కోసం చేనేత, హస్తకళలు, ఆహార ఉత్పత్తుల విభాగాల్లో మొత్తం 600 స్టాళ్లను ఉచితంగా కేటాయించినట్లు తెలిపారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు ప్రచారం కల్పించడంతోపాటు వారి ఆర్థిక స్వావలంబనకు ఈ మేళా దోహదపడుతోందని పేర్కొన్నారు.

మహిళల ఆత్మవిశ్వాసానికి, ఆర్థిక స్వావలంబనకు వేదిక సరస్ మేళా

గ్రామీణ మహిళా ఉత్పత్తుల సమాహారానికి చిరునామా

సంప్రదాయ కళలు, చేనేత, హస్తకళలకు చేయూత

మేళాను సద్వినియోగం చేసుకోండి.. కళలు, కళాకారులను ప్రోత్సహించండి

జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ





విజయవాడ, మహానగర్

జాతీయస్థాయి సరస్ మేళాను ప్రజలు సద్వినియోగం చేసుకొని గ్రామీణ మహిళల ఉత్పత్తులను ప్రోత్సహించి, కొనుగోలు చేయడం ద్వారా వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడాలని, సంప్రదాయ కళలు, చేనేత, హస్తకళలకు చేయూతనివ్వాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 31వ తేదీ వరకు విజయవాడ పున్నమి ఘాట్‌లో జరిగే సరస్ మేళా గ్రామీణ స్వయం సహాయక సంఘాల మహిళల ప్రతిభకు చిరునామాగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఇక్కడ ఉన్న దాదాపు 600 స్టాళ్లలో ఒక్కో స్టాల్ ఒక్కో నైపుణ్యానికి, ప్రతిభకు ప్రతిరూపమని వివరించారు. 50 లైవ్ ఫుడ్‌కోర్ట్స్ ఆహార ప్రియులకు మధురానుభూతులను పంచుతున్నాయన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ.. ఆంధ్రప్రదేశ్ సెర్ప్ సహకారంతో నిర్వహిస్తున్న ఈ మేళా గ్రామీణ మహిళల నైపుణ్యాలకు, సృజనాత్మకతకు, పారిశ్రామిక సామర్థ్యాలకు జాతీయస్థాయిలో గుర్తింపు తీసుకురావడంతో పాటు వారి ఆర్థిక స్వావలంబనకు బాటలు వేస్తోందన్నారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను ప్రజలకు పరిచయం చేయడానికి, విస్తృత మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకోవడానికి ఈ మేళా చక్కని వేదికగా నిలుస్తోందని తెలిపారు. ప్రజలు, సందర్శకులు పెద్ద సంఖ్యలో మేళాను సందర్శించి గ్రామీణ మహిళలు తయారుచేసిన ఉత్పత్తులను కొనుగోలు చేయడం ద్వారా వారి జీవనోపాధుల బలోపేతానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

1999లో ప్రారంభమై అంచెలంచెలుగా ఎదిగి..

1999లో ప్రారంభమైన ఈ కార్యక్రమం క్రమంగా విస్తరించి, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన గ్రామీణ ఉత్పత్తిదారులు, చేతివృత్తుల కళాకారులు, హస్తకళాకారులు, మహిళా పారిశ్రామికవేత్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ప్రతిష్ఠాత్మక మేళాగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. సరస్ మేళాలో 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి దాదాపు 1,500 మంది మహిళా పారిశ్రామికవేత్తల భాగస్వామ్యంతో ప్రత్యేకతలను ప్రతిబింబించే చేనేత వస్త్రాలు, సంప్రదాయ దుస్తులు, హస్తకళా వస్తువులు, గృహాలంకరణ ఉత్పత్తులు, చేతితో తయారుచేసిన వస్తువులు, ఆహార పదార్థాలు, గ్రామీణ ఉత్పత్తులు సందర్శకులను ఆకర్షిస్తున్నాయన్నారు. ఒక్కో ప్రాంతానికి చెందిన కళలు, సంప్రదాయాలు, ఉత్పత్తుల వైవిధ్యాన్ని తెలుసుకునే అవకాశంతో పాటు, వాటిని తయారుచేసే మహిళల శ్రమ, నైపుణ్యం, సృజనాత్మకతను గుర్తించే వేదికగా ఈ మేళా నిలుస్తోందని.. మహిళా స్వయం సహాయక సంఘాలు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవడానికి, కొత్త మార్కెట్లను చేరుకోవడానికి, వ్యాపార నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడానికి ఇది దోహదపడుతోందన్నారు.

గ్రామీణ మహిళల శ్రమను ప్రోత్సహించండి

నగరంలో నిర్వహిస్తున్న జాతీయ సరస్ ఆజీవిక మేళాలో తెలుగు హస్తకళల ప్రతిరూపాలు, ఒడిశా కళాఖండాలు, అస్సాం వెదురు బుట్టలు, సంప్రదాయ ఆభరణాలు, జనపనారతో తయారు చేసిన బ్యాగులు, ఇత్తడి కళాఖండాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయన్నారు. ప్రజలు, కుటుంబాలు, యువత, కొనుగోలుదారులు సందర్శించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ కోరారు. గ్రామీణ మహిళలు ఎంతో శ్రమించి తయారుచేసిన చేనేత వస్త్రాలు, చేతివృత్తుల ఉత్పత్తులు, సంప్రదాయ హస్తకళా వస్తువులను కొనుగోలు చేయడం ద్వారా వారి నైపుణ్యాలను ప్రోత్సహించడంతో పాటు కుటుంబాల ఆదాయ వృద్ధికి ప్రత్యక్షంగా తోడ్పడవచ్చని పేర్కొన్నారు. స్థానిక, గ్రామీణ ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సంప్రదాయ కళలు, చేతివృత్తులను పరిరక్షించడంతో పాటు మహిళా పారిశ్రామికవేత్తలకు మరిన్ని అవకాశాలు కల్పించవచ్చని తెలిపారు. ప్రజల భాగస్వామ్యంతో మేళాను విజయవంతం చేసి, గ్రామీణ మహిళల ఆత్మవిశ్వాసానికి, స్వావలంబనకు బలమైన మద్దతు అందించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

మహానగర్

అమెరికా చలిమంటలకు ఏ చమురు అనర్హం!

అవకాశవాదం... అమెరికా.. ఈ రెండిటినీ విడదీసి చూడటం అసాధ్యం. ప్రపంచానికి ఎన్ని ఆదర్శాలను అమెరికా చెప్పిందో అంతకుమించి అవకాశవాదాలనూ ప్రదర్శించింది. స్వేచ్ఛా జీవితాన్ని గడపటానికీ, ఆనందాన్ని అనుభవించటానికీ పుట్టుకతోనే మనిషికి కొన్ని హక్కులు ఉంటాయని చాలా గొప్పగా తన స్వాతంత్ర్య ప్రకటనలో చెప్పిన అమెరికా దాన్ని ఏనాడూ పాటించలేదు. ఆఫ్రికా నుంచి కొనుగోలు చేసి అమెరికాకు తెచ్చిన లక్షలాది నల్లజాతీయులకు ఆ హక్కులను ఇవ్వాలన్న ఆలోచన రాలేదు. బానిసత్వాన్ని సహజసిద్ధమైన వ్యవస్థగా ఆమోదించి దశాబ్దాలపాటు దాన్ని అమలుచేసింది. 1965 వరకూ నల్లజాతీయులకు సమానహక్కులను ఇవ్వలేదు. అట్లాంటిక్ తీరం నుంచి పసిఫిక్ తీరం వరకూ దేశాధికారాన్ని విస్తరించే క్రమంలో వందలాది ఆదిమ తెగలను హరించివేసింది. ప్రజాస్వామ్య రాజకీయాలనూ, వ్యక్తి స్వేచ్ఛనూ, ప్రైవేటు వ్యాపారాలనూ ప్రపంచమంతా విస్తరించటమే తన లక్ష్యాలని చెబుతూ అనేక దేశాల్లో నియంతృత్వ ప్రభుత్వాలకు వెన్నుదన్నుగా నిలిచింది. మత, ఛాందసవాద సమూహాలను ప్రోత్సహించింది. ప్రపంచ ప్రయోజనాల పేరుతో నిన్నటి దాకా తప్పు.. తప్పు.. అని చెప్పి.. ఒక్కరోజులోనే దాన్ని ఒప్పు.. ఒప్పు అనగలిగిన అవకాశవాద నేర్పరితనం అమెరికాకు వెన్నతో పెట్టిన విద్య. రష్యా నుంచి పెద్దఎత్తున చమురు కొనుగోలు చేయనున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ఘనంగా చేసిన ప్రకటనే ఇందుకు నిదర్శనం. నాలుగేళ్లకు పైగా సాగుతోన్న రష్యా--ఉక్రెయిన్ యుద్ధంతో ప్రపంచమే అట్టుడికిపోతోంది. రష్యాది దురాక్రమణగా భావించిన అమెరికా ఎన్ని ఆంక్షలు విధించాలో అన్నీ విధించింది. ఆ దేశం నుంచి చమురు కొంటున్న దేశాలను అదిరించి బెదిరించి లొంగదీసుకుంది. భారత్ కూడా ఒకదశలో రష్యా నుంచి కొనుగోళ్లను దాదాపుగా ఆపివేసింది. రష్యాతో లావాదేవీలను నడిపే దేశాలపై దిగుమతి సుంకాలనూ అమెరికా పెద్దఎత్తున విధించింది. ఉక్రెయిన్ సార్వభౌమత్వాన్ని కాపాడే పేరుతో విదేశాల్లో ఉన్న రష్యా ఆస్తులనూ స్తంభింపచేసింది. ఇంతటి శత్రుపూరిత వైఖరిని అతి తేలికగా మార్చుకుని అవకాశవాదంలో తనకు సాటిలేదనే విషయాన్ని అమెరికా మరోమారు స్పష్టంచేసింది. ఇలాంటి అవకాశవాదాన్ని దృష్టిలో ఉంచుకుని అమెరికా నిర్వాకాలపై గతంలో లోతైన విశ్లేషణలూ, కవిత్వాలూ చాలానే వచ్చాయి. 1961లో మహాకవి శ్రీశ్రీ కూడా ఆనాటి అమెరికా అధ్యక్షుడు కెన్నడీని ఉద్దేశిస్తూ కవిత రాశారు. 'అరువులిచ్చి కరువు తెచ్చి.. రుణంపెట్టి రణం తెచ్చి.. జనంధనం ఇంధనమై.. చరణ కరాబంధనమై.. జనన జరా మరణ దురాక్రమణల సంగ్రంథనమై.. ఒకనాడోహో అనిపించుక తిరిగిన.. ధనికవాద మికపై వెగటై జిగటై..' అంటూ ఆనాడు శ్రీశ్రీ రాసిన కవితలో కొన్ని పంక్తులు ఇప్పటికీ బాగా సరిపోతాయి. ట్రంప్ హయాంలో అమెరికా ధనికవాదం వెగటై.. జిగటై గతంలో ఎన్నడూ లేనంతగా అసహ్యం పుట్టిస్తోంది. ఒకప్పటి అమెరికా అధ్యక్షులైన అబ్రహం లింకన్, జాన్.ఎఫ్.కెన్నడీ లాంటి వారు వ్యక్తంచేసిన ఆదర్శ అభిప్రాయాలకు ప్రభావితమైన ప్రజాస్వామ్య ప్రియులు చాలామందే ఉండేవారు. ట్రంప్ లాంటి వాళ్లకు అట్లాంటివేవీ లేవు కనుక ప్రతి విధానమూ, ప్రతి ప్రకటనా ఇప్పుడు వెగటుగానే అనిపిస్తోంది. అన్నింట్లోనూ అమెరికా ప్రయోజనాలకే పెద్దపీట వేస్తామనీ, అందుకు అడ్డుగా ఉన్న అంతర్జాతీయ చట్టాలనూ, సంస్థలనూ, ఒప్పందాలనూ కాలరాస్తామని స్వయంగా అమెరికా అధ్యక్షుడే చెబుతుంటే నాగరీక మనుషులు సహించలేరు. వేల సంవత్సరాల సంస్కృతులు కలిగి, సుదీర్ఘ చరిత్రలో మానవాళి అభివృద్ధికి ఎంతో దోహదం చేసిన చైనా, భారత్ లాంటి దేశాల్లో గతం గురించి సమగ్ర అవగాహన పెరుగుతున్న కొద్దీ అమెరికాపై అసహనం ఎక్కువవుతుందే తప్ప తగ్గదు.

అమెరికా మద్దతు లేకపోతే రష్యా--ఉక్రెయిన్ యుద్ధం ఇంతకాలం కొనసాగి ఉండేది కాదు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రజాస్వామ్యవాది కాదు. ఆ దేశంలో ప్రజాస్వామ్య రాజకీయాలూ లేవు. నియంతల మనుగడకూ కొన్ని అంశాలు.. ముఖ్యంగా జాతి ప్రయోజనం, గౌరవం, భద్రత పేరుతో కూడినవి.. చాలా బాగా ఉపయోగపడతాయి. అమెరికా సారథ్యంలోని నాటో కూటమి స్వార్థం, అహంకారంతో వేసిన తప్పటడుగులు రష్యాను ఉక్రెయిన్ మీదకు ఉసిగొల్పేలా చేయగలిగాయి. జర్మనీ ఏకీకరణ (1990) సందర్భంగా నాటో విస్తరణ ఒక్క అంగుళం కూడా అదనంగా ఉండదని ఆనాటి సోవియట్ యూనియన్ అధ్యక్షుడైన మిఖాయిల్ గోర్బచెవ్‌కు అమెరికా హామీ ఇచ్చింది. ఈ హామీ మేరకే జర్మనీ ఏకీకరణ సాఫీగా సాగటానికి సోవియట్ యూనియన్ సహకరించింది. ఆ తర్వాత కొద్దికాలానికే సోవియట్ యూనియన్ (1991 డిసెంబర్ 26) పతనమైంది. రష్యా సహా 15 దేశాలు విడివిడిగా ఏర్పాటయ్యాయి. వీటిల్లో 9 దేశాలు క్రమంగా నాటోలో చేరిపోయాయి. ఒక్క అంగుళం హామీ అలా గాల్లో కలిసిపోయింది. రష్యాలో 2000 సంవత్సరం వరకూ ఆర్థికంగా అల్లకల్లోల పరిస్థితులే ఉన్నాయి. వీటికీ ఒక రకంగా అమెరికాయే కారణం. దశాబ్దాల పాటు కొనసాగిన ప్రభుత్వ నియంత్రిత ఆర్థిక వ్యవస్థను ఒక్కపెట్టున ప్రైవేటుపరం చేయటంతో పరిస్థితులు గాడితప్పాయి. ప్రభుత్వ సంస్థలనూ, కంపెనీలనూ కారుచౌకగా ప్రైవేటు రంగానికి కట్టబెట్టారు. అన్నిటినీ మార్కెట్‌కే వదలివేయటంతో ధరలూ, నిరుద్యోగమూ విజృంభించాయి. బ్లాక్‌మార్కెట్ సర్వసాధారణమైంది. విద్య, వైద్యరంగం, ప్రాథమిక సౌకర్యాల్లో ప్రభుత్వ పెట్టుబడులు తగ్గిపోవటంతో జీవన ప్రమాణాలు క్షీణించాయి. ప్రైవేటురంగంతో పోటీ పెరిగి రష్యా అభివృద్ధి పథంలో పరుగులు పెడుతుందన్న జోస్యాలు ఏ రకంగానూ నిజంకాలేదు. ఒకరకంగా అరాచకమే ప్రబలిపోయింది. అట్లా అమెరికా ప్రభుత్వమూ, ఆ దేశ మేధావులూ సూచించిన విధానాలు అస్తవ్యస్త పరిస్థితులకే దారితీశాయి. పుతిన్ అధికారాన్ని చేజిక్కించుకోటానికి అవే కారణమయ్యాయి. ఆ నేపథ్యంలోనే రష్యాకు మళ్లీ ఒకనాటి వైభవాన్ని తీసుకువస్తానన్న పుతిన్ వాగ్దానాలు ప్రజలపై ప్రభావాన్ని కలగచేశాయి. ఒక భాష, ఒక మతం, ఒక జాతి (జ్ఞ్ష్ట్రఅఱఎ జశీఎఎబఅఱ్ఱఎ) దేశ అస్తిత్వానికి పునాదిగా ఉన్నచోట భావోద్వేగాలను రెచ్చగొట్టటం తేలిక. రష్యాకు చుట్టూ ప్రమాదం ముంచుకొస్తోందన్న పుతిన్ ప్రచారానికి ఆ ఉద్వేగాలు తోడ్పడ్డాయి. ఉక్రెయిన్, జార్జియాలు కూడా భవిష్యత్తులో నాటోలో చేరతాయన్న ప్రకటనతో (2008) రష్యాలో భయాలు మరింత తీవ్రమయ్యాయి. ఇక అక్కడి నుంచి ఉక్రెయిన్‌పై రష్యా బాగా దృష్టి పెట్టింది. రష్యాకు అనుకూలంగా ఉండే ఉక్రెయిన్ అధ్యక్షుడు విక్టర్ యూనుకోవిట్ అధికారాన్ని కోల్పోవటంలో అమెరికా, పశ్చిమ యూరప్ దేశాల పాత్ర చాలా ఉంది. మైదాన్ విప్లవం పేరుతో ఉక్రెయిన్‌లో జరిగిన రాజకీయ పరిణామాలకు అమెరికా పూర్తిగా సహకరించింది. ఆ వెంటనే క్రిమియాను రష్యా ఆక్రమించింది. ఉక్రెయిన్‌లోని రష్యా సరిహద్దు ప్రాంతాల్లో తిరుగుబాట్లను పోత్సహించింది. చివరికి 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై ప్రత్యక్ష యుద్ధానికి దిగింది. ఉక్రెయిన్‌కు యుద్ధ సహాయం కింద అమెరికా ఈ ఏడాది మార్చివరకూ రూ.12 లక్షల కోట్లను ఖర్చుపెట్టింది. మొత్తంగా రూ.17 లక్షల కోట్లు వ్యయం అవుతాయని లెక్కలుకట్టింది. ఇవిగాక ప్రపంచ బ్యాంకు నుంచి ఉక్రెయిన్‌కు రూ.1.90 లక్షల కోట్లను రుణంగా ఇప్పించింది. యూరోపియన్ యూనియన్ (ఈయూ) మరో రూ.22 లక్షల కోట్లను ఉక్రెయిన్ యుద్ధానికి ఖర్చు చేస్తోంది. అంటే అమెరికా, ఈయూ కలిసి దాదాపు రూ.40 లక్షల కోట్లను వెచ్చిస్తున్నాయి. ఉక్రెయిన్ తటస్థ దేశంగా ఉంటుందనీ, నాటో కూటమిలో చేర్చుకునేది లేదనీ స్పష్టంచేయకుండా, నాలుగున్నర ఏళ్ల నుంచీ దౌత్యపరమైన చొరవను ప్రదర్శించకుండా, లక్షల మరణాలకూ, భౌతిక ఆస్తుల విధ్వంసానికి అమెరికాయే ప్రధానంగా ప్రత్యక్ష, పరోక్ష కారణమైంది. ఇంతగా కకావికలు చేసి మధ్యంతర ఎన్నికల్లో గెలవటానికి రష్యా చమురు కొనుగోలునే అస్త్రంగా చేసుకుని రాజకీయంగా దిగజారిపోతున్న ప్రతిష్ఠను కాపాడుకోటానికి ట్రంప్ ప్రయత్నిస్తున్నారు. ఎన్నికల ఫలితాల అనంతరం అవసరమైతే మళ్లీ రష్యా చమురు అమ్మకాలపై నిషేధాన్ని విధించొచ్చు. యుద్ధం వల్ల ఇప్పటికే జరిగిన ప్రాణనష్టం లక్షల్లో ఉంది. అనధికార అంచనాల ప్రకారమే ఇరు దేశాలకు చెందిన 6 లక్షల మంది సైనికులు మరణించారు. ఇందులో రష్యను సైనికులే నాలుగున్నర లక్షల దాకా ఉండొచ్చు. పౌరులు 20 వేల మంది చనిపోయి ఉంటారన్నది అంచనా. గాయపడిన వాళ్లు 15 లక్షల దాకా ఉండొచ్చు. ఆస్తుల విధ్వంసం, ఆర్థిక వ్యవస్థకు ఇతరత్రా జరిగిన నష్టం ఉక్రెయిన్‌లోనే రూ.82 లక్షల కోట్లు ఉంటుంది. యుద్ధం ముగిస్తే ఆ దేశంలో పునర్ నిర్మాణానికి రూ.56 లక్షల కోట్లు ఖర్చుపెట్టాల్సి వస్తుంది. ఇక రష్యాలో జరిగిన నష్టం గురించి అంచనాలు బయటకు రావటం లేదు. ఉక్రెయిన్‌తో పోల్చితే అది నాలుగో వంతే ఉండొచ్చు. ఈ శతాబ్దంలో అమెరికా ప్రత్యక్షంగా యుద్ధాలు చేసిన చోటా (ఆఫ్ఘనిస్థాన్, ఇరాక్), పరోక్షంగా యుద్ధాలను రగిల్చిన చోటా ఎక్కడా శాంతిని నెలకొల్పిన దాఖలాల్లేవు.

ఇథనాల్, కోలా, డేటా సెంటర్లకు ఇకనైనా నీళ్లు ఆపండి!



రాష్ట్రంలో ఈ ఏడాది ఖరీఫ్ వ్యవసాయాన్ని ఎల్‌నినో తీవ్రంగా దెబ్బతీసింది. వర్షాభావం, అడుగంటిపోతున్న భూగర్భ జలాలు, ఖాళీ అవుతున్న రిజర్వాయర్లు రాష్ట్రంలో తీవ్ర కరువు పరిస్థితులను సృష్టిస్తున్నాయి. ఇప్పటికే పెసర, మినుము, సోయాబీన్ వంటి పంటలు కోతకు వస్తుండగా, మిగిలిన పంటలు నీరందక ఎండిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో బావులు, బోర్లు ఎండిపోవడంతో పాటు విద్యుత్ కోతలు సర్వసాధారణమయ్యాయి. యూనిట్‌కు పది రూపాయలు చెల్లించి కొందామన్నా మార్కెట్‌లో విద్యుత్ లభించని పరిస్థితి ఉందని ప్రభుత్వమే ప్రకటించడం పరిస్థితుల తీవ్రతకు అద్దం పడుతోంది. రాష్ట్ర వ్యవసాయానికి ఆధారమైన నైరుతి రుతుపవనాల కాలంలో వర్షపాతం తీవ్రంగా పడిపోయింది. ఈ రుతుపవనాల సాధారణ వర్షపాతం 740.6 మిల్లీమీటర్లు కాగా, గత సంవత్సరం జూన్ 1 నుంచి సెప్టెంబర్ 30 వరకు 988.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. కానీ ఈ ఏడాది అదే కాలంలో 615.5 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో 16 జిల్లాలు మాత్రమే సాధారణ వర్షపాతాన్ని నమోదు చేయగా, ఏకంగా 17 జిల్లాల్లో 20శాతం నుంచి 59 శాతం వరకు లోటు వర్షపాతం నమోదైంది. గతేడాది సెప్టెంబర్ 30 నాటికి రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్లలో 848.77 టీఎంసీల నీరు ఉండగా, ఈ ఏడాది అది 475.57 టీఎంసీలకు పడిపోయింది.

ఉపరితల నీటి లభ్యత తగ్గడంతో రైతులు బోర్లపై విపరీతంగా ఆధారపడ్డారు. దీనికి తోడు నీటి వినియోగం ఎక్కువగా ఉండే వరి, పత్తి పంటలను విస్తృతంగా సాగు చేయడంతో భూగర్భ జలాలు పాతాళానికి పడిపోయాయి. రాష్ట్రవ్యాప్తంగా సగటు భూగర్భ జలమట్టం గత ఏడాది ఆగస్టులో 5.78 మీటర్లు ఉండగా, ఈ ఏడాది ఆగస్టు నాటికి 7.87 మీటర్లకు పడిపోయింది. ఈ ఖరీఫ్ సీజన్‌లో పంటల సాగు విస్తీర్ణం కూడా తగ్గింది. రాష్ట్ర సాధారణ సాగు విస్తీర్ణం 1,32,38,446 ఎకరాలు కాగా, ఈసారి 1,25,85,426 ఎకరాలకు పరిమితమైంది. వరి సాధారణ సాగు విస్తీర్ణం 65,95,645 ఎకరాలు కాగా, గతేడాది ఖరీఫ్‌లో 67,33,484 ఎకరాల్లో సాగై, ఈసారి 56,79,969 ఎకరాలకు అంటే దాదాపు 9 లక్షల ఎకరాలకు పైగా తగ్గింది. ధాన్యాల మొత్తం సాగు విస్తీర్ణం 72,48,771 ఎకరాలకు గాను 63,12,526 ఎకరాల్లో (87శాతం) మాత్రమే సాగైంది. నూనెగింజల సాగు 4,47,585 ఎకరాల సాధారణ విస్తీర్ణానికి గాను 3,96,597 ఎకరాలకు పరిమితమైంది.

రాబోయే యాసంగి (రబీ) సీజన్‌లో వరి వంటి నీరు ఎక్కువగా అవసరమయ్యే పంటలను సాగు చేయడం తీవ్ర ప్రమాదకరమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నీటి లభ్యతను బట్టి డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతుల ద్వారా తక్కువ నీటితో పండే జొన్న, సజ్జ, రాగి వంటి చిరుధాన్యాలు, శనగ, పెసర వంటి పప్పుధాన్యాలు, ఆముదం, వేరుశనగ వంటి నూనెగింజల ఆరుతడి పంటలను మాత్రమే వేయాలి. మరోవైపు ప్రభుత్వం శాస్త్రీయ అవగాహన లేకుండా ప్రోత్సహిస్తున్న ఆయిల్ పామ్ సాగు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలి. ఒక ఆయిల్ పామ్ చెట్టుకు రోజుకు 250 నుంచి 300 లీటర్ల నీరు, ఏటా 1500 నుంచి 1800 మి.మీ వర్షపాతం అవసరం. కరువు సమయంలో కొత్తగా ఆయిల్ పామ్ నాటితే 90శాతానికి పైగా లేత మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉంది. ఈ క్లిష్ట సమయంలో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కరువు మండలాలను ప్రకటించి, కేంద్రానికి నివేదికలు పంపి ఎన్‌డీఆర్ఎఫ్ నిధులతో పాటు రాష్ట్ర బడ్జెట్ నుంచి నిధులు కేటాయించాలి. ఇతర మౌలిక వసతుల కాంట్రాక్టర్లకు ఇచ్చే నిధులను కరువు పీడిత గ్రామాలకు మళ్లించాలి. రాష్ట్రంలో పంటల బీమా పథకాన్ని వెంటనే అమలులోకి తేవాలి. ఖరీఫ్‌లో సగటు దిగుబడులు పడిపోయిన రైతులందరికీ బీమా పథకం కింద నష్ట పరిహారం అందించాలి. గత ఆరు సీజన్లుగా పంటల బీమా పథకం లేక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ పథకం ప్రయోజనాలను పొందడానికి వీలుగా కౌలు రైతులను కూడా ప్రభుత్వం తక్షణమే గుర్తించాలి. ఈ సీజన్‌లో పంటల సగటు దిగుబడులు బాగా తగ్గిన రైతులతో పాటు కూరగాయల రైతులకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలి. కౌలు రైతులతో సహా, పంటలు ఎండిపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి. వరి, పత్తి లాంటి ప్రధాన పంటలకు 2026లో స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం నిర్ణయించిన రుణ పరిమితిలో 50శాతం వరకూ రైతులకు పరిహారంగా అందించాలి. కౌలు రైతుల గుర్తింపు కోసం 2011 అధీకృత సాగుదారుల చట్టాన్ని అమలు చేయాలి. వ్యవసాయంలో కీలకపాత్ర పోషిస్తున్న మహిళా రైతులను గుర్తించడానికి మహారాష్ట్ర తరహాలో ప్రత్యేక చట్టాన్ని తేవాలి. పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, నూనెగింజలకు మద్దతు ధర దక్కేలా ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. యాసంగికి ఆరుతడి విత్తనాలను ఉచితంగా సరఫరా చేయాలి. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడడంతో పాటు పశువుల మేతను సరఫరా చేయాలి. వలసలను నివారించడానికి ఉపాధి హామీ పనులను తక్షణమే విస్తృతంగా ప్రారంభించాలి. ఎక్కువ మందికి పనులు కల్పించడానికి వీలుగా చిన్న, సన్నకారు రైతులకు, గ్రామీణ మౌలిక వసతులైన గిడ్డంగులు, డ్రయ్యింగ్ యార్డులు, స్కూల్ భవనాలు, లాంటి మౌలిక వసతుల మేలు జరిగేలా ఈ సీజన్‌లో ఉన్న ప్రత్యేక పరిస్థితి దృష్ట్యా కొత్త పనులను ఉపాధి హామీ పథకానికి జోడించాలి. రైతుల, స్వయం సహాయక బృందాల బ్యాంకు అప్పుల వాయిదాలను ప్రభుత్వం ఒక ఏడాది పాటు వాయిదా వేసి, వడ్డీలను మాఫీ చేయాలి. ఇప్పటికీ మిషన్ భగీరథ పథకం గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాలలో పూర్తి స్థాయిలో అమలు కావడం లేదు. చాలా చోట్ల ఈ ప్రాంతాల ప్రజలకు తాగునీరు అందడం లేదు. మిషన్ భగీరథ పూర్తి స్థాయి మంచి నీటి పథకం. ఈ పథకం అమలులోని సమస్యలను పరిష్కరించడానికి, తగిన స్థాయిలో తాగునీటిని ప్రజలకు సరఫరా చేయడానికి ప్రభుత్వం పూనుకోకపోవడం వల్ల, ప్రజలు ఎంతో డబ్బు వెచ్చించి నీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇది ఆయా కుటుంబాలపై పెద్ద ఆర్థిక భారాన్ని మోపుతున్నది. అన్నింటికంటే ముఖ్యంగా, ప్రాజెక్టులలో నీటి కొరత ఉన్నందున మిషన్ భగీరథ నీటిని ఇథనాల్, కోకాకోలా, డేటా సెంటర్లు వంటి పరిశ్రమలకు మళ్లించకుండా, కేవలం ప్రజల తాగునీటికి, ఆరుతడి పంటలకు మాత్రమే వినియోగించాలి

కక్షసాధింపులో 'బతుకమ్మ' బలి!



తెలంగాణ ఉద్యమంలో అస్తిత్వ పతాకగా నిలిచిన బతుకమ్మపై ఉద్యమ ద్వేషులైన కాంగ్రెస్ పాలకులు వారి సహజ రీతిలోనే వివక్ష చూపిస్తున్నారు. ఈ పండుగకు సిరిసిల్ల నేతన్నలకు కనీసం చీరల ఆర్డర్లు కూడా సరిగా ఇవ్వకపోవడంతో కార్మిక కుటుంబాలు ఆకలికేకలతో అల్లాడుతున్నాయి. కనిపించిన దేవుళ్ల పేర్లన్నీ వాడుకొని రాజకీయం చేసే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, తెలంగాణ ఆడబిడ్డల ఘనమైన పండుగ బతుకమ్మకు సరైన ఏర్పాట్లు చేయడం చేతకావడం లేదా? లేదం టే, బతుకమ్మ ఆటపాటల్లో కూడా వినాయకచవితి పండుగలాగే ఊరూరా కేసీఆర్ గానమే వినిపిస్తుందనే భయమా? అని ప్రజల్లో చర్చ జరుగుతున్నది. స్వరాష్ట్ర కల సాకారమైన ఆత్మగౌరవ ప్రతీక. పరాయి పాలకుల గడ్డపై, ఆంధ్రా వలస పాలనలో అణచివేతకు గురైనా మన అస్తిత్వాన్ని చాటుకోవడానికి, ఉద్యమకాలంలో ఇదే బతుకమ్మ తెలంగాణ అస్తిత్వ పతాకమై నిలిచింది. ఆనాడు ఉద్యమంలో వీధివీధినా పూల సింగిడిలై కదిలిన ఆడబిడ్డలు, స్వయంపాలన కాంక్షను ఈ పండుగ ద్వారానే చాటారు. కేసీఆర్ నాయకత్వంలోని గులాబీ సైన్యం ఈ పండుగకు బ్రాండ్ అంబాసిడర్‌గా ముందుండి నిలిచింది. తెలంగాణ సంస్కృతి, బతుకమ్మ విశిష్టతను గల్లీ నుంచి ఢిల్లీ దాటించి లండన్, అమెరికా మీదుగా దుబాయ్ బుర్జు ఖలీఫా స్క్రీన్ల వరకు చేర్చి, అంతర్జాతీయ స్థాయిలో బతుకమ్మకు ఒక సగర్వమైన గుర్తింపును తెచ్చింది బీఆర్ఎస్ శ్రేణులే. స్వరాష్ట్రంలో అధికారం మార్పిడి జరిగి, కాంగ్రెస్ పాలకులు గద్దెనెక్కిన తర్వాత నుంచి కనిపిస్తున్న దృశ్యాలు ప్రతీ తెలంగాణవాసి గుండెను రగిలిస్తున్నాయి. అధికార పార్టీకి తెలంగాణ సంస్కృతి అన్నా, ఇక్కడి సంప్రదాయాలన్నా ఎంతటి చులకన భావమున్నదో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఖరి చూస్తే స్పష్టమవుతున్నది. బతుకమ్మ పండుగను తాము ఎంత ఘనంగా నిర్వహించినా, అది తెలంగాణ వాదానికి, బీఆర్ఎస్‌కు, కేసీఆర్‌కు లబ్ధి చేకూరుస్తుందనే అక్కసుతో, తీవ్రమైన రాజకీయ ద్వేషంతోనే రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా పట్టించుకోవడం లేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో కోటి మందికిపైగా ఆడబిడ్డల ఇంటికి 'బతుకమ్మ కానుక'గా రేషన్ షాపుల ద్వారా వారం రోజుల ముందే చీరల పంపిణీ కార్యక్రమం చేపట్టి, పూర్తి చేసేవారు. వందలాది రంగులు, అద్భుతమైన డిజైన్లతో ఒక కుటుంబంలో అన్నగా, తమ్ముడిగా ముఖ్యమంత్రి కేసీఆర్ పంపే ఆ చీరల కోసం మహిళలు ఎంతగానో ఎదురుచూసేవారు. కానీ నేడు, ఇందిరమ్మ రాజ్యం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో బతుకమ్మ కానుకలపై కక్షసాధింపు చర్యలు మొదలయ్యాయి. ఆడబిడ్డల ఆత్మగౌరవాన్ని బజారుకీడుస్తూ, చీరల పంపిణీని నిలిపివేసి, బతుకమ్మపై తమకున్న వివక్షను బట్టబయలు చేసుకున్నారు. నాడు బతుకమ్మ చీరల ఆర్డర్ల వల్ల సిరిసిల్ల పవర్‌లూమ్ రంగానికి, పోచంపల్లి చేనేత కార్మికులకు రూ.350 కోట్లకు పైగా బడ్జెట్‌తో నిరంతరాయంగా ఉపాధి లభించేది. ఆ మగ్గాల చప్పుడు నేతన్నల ఇండ్లల్లో సంక్రాంతి సంబురాన్ని నింపేది. కానీ నేడు కాంగ్రెస్ సర్కార్ నేతన్నలకు పాత బకాయిలు చెల్లించకుండా, కొత్త ఆర్డర్లు ఇవ్వకుండా తాత్సారం చేస్తున్నది. సిరిసిల్ల నేతన్నలను బతుకమ్మ చీరల నెపంతో రోడ్డున పడేసి, సూరత్ కంపెనీలకు మేలు చేసేలా కాంగ్రెస్ నాయకులు వ్యవహరించడం వెనుక ఉన్న కుట్రలేమిటో ప్రజలంతా గమనిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో బతుకమ్మను రాష్ట్ర పండుగగా ప్రకటించి, సాంస్కృతిక శాఖ ద్వారా ప్రతి ఏటా కోట్ల రూపాయల నిధులను నేరుగా జిల్లాలకు, గ్రామ పంచాయతీలకు కేటాయించేవారు. హైదరాబాద్ నగరంలోని ప్రధాన చెరువులు, రాష్ట్రంలోనే వేలాది నిమజ్జన ప్రాంతాలన్నీ విద్యుత్తు వెలుగులతో, అద్భుతమైన మౌలిక వసతులతో, క్యూలైన్లతో వైభవంగా వెలిగిపోయేవి. కానీ నేడు ఆ చెరువుల్లో కనీసం గుర్రపుడెక్కను తీయడానికి, వీధి దీపాలు ఏర్పాటు చేయడానికి కూడా స్థానిక సంస్థల వద్ద నిధులు లేకపోవడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి. అనవసరమైన పనులకు వేల కోట్లాది రూపాయలను కేటాయిస్తున్న కాంగ్రెస్ సర్కార్, బతుకమ్మ పండుగ నిర్వహణకు బడ్జెట్ విడుదల చేయకుండా చేతులెత్తేసి, తెలంగాణ పరువు తీసింది. ఢిల్లీ పాలకుల కనుసన్నల్లో నడిచే కాంగ్రెస్ ప్రభుత్వానికి తెలంగాణ మట్టి వాసన, ఇక్కడి అస్తిత్వ పండుగల విలువ తెలియకపోవడంలో ఆశ్చర్యం లేదు. కానీ, కేసీఆర్‌పై ఉన్న రాజకీయ కక్షను తెలంగాణ పౌరుల ఆత్మగౌరవమైన బతుకమ్మ పండుగపై చూపించడం అత్యంత దుర్మార్గం. ఈ వివక్షను తెలంగాణ సమాజం అంతా గమనిస్తున్నది. మన సంస్కృతిని గౌరవించని రాష్ట్ర పాలకులకు, మన పండుగలను అవమానించే ఈ శక్తులకు ఈ గడ్డపై పుట్టిన ప్రతి ఆడబిడ్డ, ప్రతి నేతన్న రాబోయే రోజుల్లో తమ ఓ టుహక్కు రూపంలో బుద్ధి చెప్పడం ఖాయం.

సౌదీ అరేబియాలోని భారతీయులకు అలర్ట్



సౌదీ అరేబియాలో భద్రతాపరమైన ఆందోళనలు పెరుగుతున్న నేపథ్యంలో భారత రాయబార కార్యాలయం కీలక సూచనలు జారీ చేసింది. సౌదీ ప్రభుత్వం జారీచేసే మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని భారతీయులకు సూచించింది. ప్రమాదం తొలగిపోయేవరకు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని కిటికీలు, అద్దాలు, బాల్కనీలకు దూరంగా సురక్షితమైన గదుల్లోనే ఉండాలని పేర్కొంది. మక్కా, మదీనా, రియాద్, తూర్పు ప్రావిన్సుల్లో అత్యవసర సహాయం కోసం '911' నంబర్‌కు, మిగతా ప్రాంతాల వారు '998' నంబర్‌కు కాల్ చేయాలని భారత ఎంబసీ సూచించింది. ముఖ్యంగా దాడికి సంబంధించిన ఫోటోలు, వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని భారత ఎంబసీ హెచ్చరించింది.

సౌదీ అధికారులు అత్యవసర హెచ్చరికల కోసం జాతీయ ముందస్తు హెచ్చరిక వేదిక ద్వారా జారీ చేస్తున్న తాజా మార్గదర్శకాలను గమనించాలని, వాటిని తప్పనిసరిగా పాటించాలని ఆదివారం సూచించింది. అత్యవసర హెచ్చరికలు అందినప్పుడు ఆందోళన చెందకుండా ప్రశాంతంగా ఉండాలని సౌదీ అధికారులు సూచించారు. ప్రమాదం తొలగిపోయే వరకు భవనంలోని సురక్షిత ప్రాంతానికి వెంటనే వెళ్లాలని, వీలైతే కిటికీలకు దూరంగా ఉన్న లోపలి గదిలో ఉండాలని తెలిపారు. ప్రమాదం ముగిసే వరకు ఇళ్లను లేదా భవనాలను విడిచి బయటకు రావద్దని, బహిరంగ ప్రదేశాలు, కిటికీలు, అద్దాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాల్కనీలు, భవనాల పైకప్పులపై నిలబడకూడదని స్పష్టం చేశారు.

బయట ఉంటే ఏం చేయాలి?

హెచ్చరికలు వచ్చిన సమయంలో బయట ఉన్నవారు సమీపంలోని భవనంలోకి వెళ్లాలని లేదా బలమైన రక్షణ కల్పించే గోడ వంటి నిర్మాణం వెనుక ఆశ్రయం పొందాలని సూచించారు. జనసమూహాలు, ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని, ఘటనలకు సంబంధించిన ఫొటోలు తీయడం మానుకోవాలని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. వాహనం నడుపుతున్న సమయంలో అత్యవసర హెచ్చరిక అందితే వంతెనలు, ఎత్తైన భవనాలకు దూరంగా రహదారి పక్కన వాహనాన్ని నిలిపివేయాలని సూచించారు. అధికారుల నుంచి తదుపరి సమాచారం వచ్చే వరకు వారి సూచనలను పాటించాలని తెలిపారు.

అత్యవసర నంబర్లు ఇవే

ప్రమాదం లేదా ముప్పు ఎదురైనప్పుడు సౌదీ అరేబియాలోని మక్కా, మదీనా, రియాద్, తూర్పు ప్రావిన్స్ ప్రాంతాల్లో 911 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. మిగతా ప్రాంతాల్లో అత్యవసర సహాయం కోసం 998 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. ప్రభుత్వ అధికారిక మార్గాల ద్వారా వెలువడే ప్రకటనలు, సూచనలను మాత్రమే అనుసరించాలని భారత రాయబార కార్యాలయం భారతీయులకు విజ్ఞప్తి చేసింది.

రియాద్ విమానాశ్రయంపై దాడితో ఆందోళనలు

యెమెన్‌కు చెందిన హూతీ తిరుగుబాటుదారులు సౌదీ అరేబియాపై డ్రోన్లు, క్షిపణులతో దాడులు చేస్తున్న నేపథ్యంలో భద్రతాపరమైన ఆందోళనలు పెరిగాయి. అక్టోబర్ 10న రియాద్‌లోని కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన ప్రాణాంతక దాడిలో ఓ భారతీయుడు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. ఈ ఘటనతో భారత రాయబార కార్యాలయం మరోసారి భద్రతా సూచనలు జారీ చేసింది.

హూతీలకు సౌదీ హెచ్చరిక

మరోవైపు తమ విమానాశ్రయాలతోపాటు ఓడరేవులు, చమురుకేంద్రాలు, పౌర సదుపాయాలపై తక్షణమే దాడులు నిలిపివేయాలని హూతీ రెబల్స్‌కు సౌదీ హెచ్చరిక చేసింది. రియాద్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కూటమి అధికార ప్రతినిధి మేజర్ జనరల్ తుర్కీ అల్-మల్కీ ఈ మేరకు హెచ్చరిక చేశారు. అభా, నజ్రాన్, జాజాన్ విమానాశ్రయాలపై హూతీలు చేసిన దాడుల వీడియోలను మీడియా ముందు ప్రదర్శించారు. సౌదీలోని విమానాశ్రయాలపై జరిగిన వరుస దాడుల్లో 19మంది ప్రాణాలు కోల్పోగా, 364మంది గాయపడినట్లు అధికారులు వెల్లడించారు. యెమెన్ పౌరులకు హాని జరగకుండా హూతీల సైనిక స్థావరాలనే తమ బలగాలు దాడులు చేస్తున్నట్లు సౌదీ కూటమి మేజర్ జనరల్ తెలిపారు.

ఓట్ల చోరీకి పాల్పడుతున్న వారికి శిక్ష తప్పదు



ఓట్లచోరీకి పాల్పడుతున్న ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జజుజ జ్ఞానేశ్ కుమార్ త్వరలోనే చట్టం ముందు నిలవాల్సి వస్తుందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. వారు తమ తప్పులకు మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. గోవాలోని మర్గావ్‌లో జరిగిన కాంగ్రెస్ గోయ్ రఖోన్ యాత్రలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. కాంగ్రెస్ శ్రేణులతో కలిసి 2కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించిన రాహుల్ జ్ఞానేశ్ కుమార్ ఓట్ల చోరీకి పాల్పడుతుంటే మోదీ, అమిత్ షా ఆయనకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ రాజ్యాంగాన్ని పరిరక్షించే శక్తి అని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మోదీ, షా, జ్ఞానేశ్ కుమార్‌లను వదిలిపెట్టేది లేదని రాహుల్ గాంధీ తేల్చిచెప్పారు. "ఓటు చోరీ విషయంలో ఇక ఎలాంటి సందేహాలకు తావులేదు. మోదీ తెరవెనుక ప్రణాళికలు రచిస్తే, అమిత్ షా వాటిని నిర్వహిస్తున్నారు. సీఈసీ అమలు చేస్తున్నారు. మోదీ, అమిత్ షా, జ్ఞానేశ్ కుమార్ మా నుంచి తప్పించుకోలేరు. రాజ్యాంగాన్ని పరిరక్షించే బాధ్యత కాంగ్రెస్‌పై ఉంది. నాపై 45కు పైగా పరువునష్టం కేసులు ఉన్నాయి. వాటిలో మోదీ, అమిత్ షాలకు సంబంధించిన వ్యక్తులు దాఖలు చేసిన కేసులే ఉన్నాయి. అయితే, ప్రధానమంత్రి ఓటు చోరీకి పాల్పడ్డారని నా ఆరోపణపై ఇప్పటివరకు కేసు నమోదు కాలేదు. ఈ అంశంపై కేసు పెడితే అది పూర్తిస్థాయి న్యాయపరమైన వ్యవహారంగా మారుతుందనే భయంతోనే వెనుకడుగు వేస్తున్నారు. మధ్యప్రదేశ్, హరియాణా, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, బంగాల్?, అసోంలలో ఓటు చోరీ జరిగిందని ఆధారాలతో సహా నిరూపించాం. ప్రతిపక్షాలకు చెందిన ఓట్లను తొలగించడం, అధికార పార్టీకి అనుకూలంగా ఓట్లు చేర్చారు. ఓటర్లను ఒక జిల్లా నుంచి మరో జిల్లాకు మార్చారు. ఇతర రాష్ట్రాల నుంచి ఓటర్లను తీసుకురావడం వంటి అక్రమాలు జరిగాయి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలి. ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడే బాధ్యత మాపై ఉంది"

'అదానీ, అంబానీలకు ప్రయోజనాలు'

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొందరు పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని రాహుల్ ఆరోపించారు. గౌతమ్ అదానీ, ముఖేశ్ అంబానీలకు మేలు చేకూర్చేలా మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, భూములు, ఇతర ఆర్థిక అవకాశాలను కట్టబెడుతున్నారని విమర్శించారు. ప్రతిఫలంగా ఆయా పారిశ్రామికవేత్తలు ప్రభుత్వానికి ప్రచారం కల్పిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం కొందరు బిలియనీర్లకు డబ్బు, కాంట్రాక్టులు, భూములు అందిస్తూ, వారి ద్వారా రాజకీయ ప్రచార ప్రయోజనాలు పొందుతోందని వ్యాఖ్యానించారు. దేశంలో ప్రభుత్వ వ్యవస్థ పనిచేస్తున్న తీరుపై ప్రశ్నలు లేవనెత్తారు.

'గోవాలో భూములు లాక్కుంటున్నారు'

గోవాలో రైతులు, పేదలకు చెందిన భూములను ప్రభుత్వం లాక్కొని బయటి వ్యక్తులకు అప్పగిస్తోందని రాహుల్ గాంధీ ఆరోపించారు. ప్రాంతీయ మాస్టర్ ప్లాన్ రద్దు నేపథ్యంలో ప్రభుత్వానికి సన్నిహితులైన వారికి భూములు కట్టబెట్టే పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు. రాష్ట్ర సహజ సంపద, సాంస్కృతిక వారసత్వాన్ని ఆర్థిక ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటున్నారని ఆరోపించారు. దేశంలో అత్యధిక నిరుద్యోగం ఉన్న రాష్ట్రంగా గోవా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఉపాధి అవకాశాలు లేక యువత విదేశాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ఉద్యోగ కల్పన వ్యవస్థను బీజేపీ ప్రభుత్వం దెబ్బతీసిందని విమర్శించారు. గతంలో నరేంద్ర మోదీ హయాంలో గుజరాత్ నమూనా గురించి మాట్లాడేవారని, ఇప్పుడు గోవాలో అవినీతి నమూనా కనిపిస్తోందని వ్యాఖ్యానించారు

'యువతను వెలివేసే వ్యవస్థ'

దేశంలోని విద్యా వ్యవస్థపై కూడా రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. డబ్బు అధికారం లేనివారిని, ఆంగ్లంలో మాట్లాడలేని వారిని ప్రస్తుత వ్యవస్థ పక్కన పెడుతోందని విద్యార్థులతో తన సంభాషణకు సంబంధించిన వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకున్నారు. లక్షలాది మంది భారతీయ యువతకు విద్యా అవకాశాలు దక్కకుండా చేసే విధానాన్ని విద్యా వ్యవస్థగా పిలవలేమని వ్యాఖ్యానించారు.

మా తీర్పు కాగితాలకే పరిమితం కావాలా?



రుతుక్రమ ఆరోగ్యాన్ని (బహిష్టు పరిశుభ్రత) ప్రాథమిక హక్కులో భాగంగా గుర్తిస్తూ ఇచ్చిన తీర్పు అమలుపై రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు స్పందించకపోవడంపై సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం కోరినప్పటికీ ఇప్పటివరకు అవసరమైన వివరాలు అందించకపోవడంపై ప్రశ్నించింది. తదుపరి విచారణ నాటికి కూడా స్పందించకపోతే, ఆయా రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించింది. జస్టిస్ జేబీ పార్థివాలా, జస్టిస్ ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం అక్టోబర్ 13న ఈ అంశంపై విచారించింది. బహిష్టు ఆరోగ్యానికి సంబంధించిన ప్రాథమిక హక్కు తీర్పు కేవలం కాగితాలకే పరిమితం కాకూడదని స్పష్టం చేసింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 జీవించే హక్కు, వ్యక్తిగత స్వేచ్ఛకు రక్షణ కల్పిస్తుందని ధర్మాసనం గుర్తుచేసింది. రుతుక్రమ పరిశుభ్రత, ఆరోగ్యం కూడా ఈ హక్కులో భాగమని సుప్రీం కోర్టు ఇప్పటికే ప్రకటించిందని తెలిపింది. సెప్టెంబర్ 1న ఇచ్చిన ఆదేశాల్లో తీర్పులో ప్రస్తావించిన లోపాల్ని పరిశీలించి, వాటిపై తీసుకున్న చర్యల వివరాల్ని తదుపరి విచారణకు సమర్పించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించినట్లు బెంచ్ గుర్తుచేసింది. అయినా కేంద్రం కోరిన సమాచారం ఇవ్వకపోవడంపై కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు తీర్పులో చెప్పిన అంశాలు కేవలం కాగితాలపైనే ఉంటే, ఈ ప్రాథమిక హక్కును కేంద్రం, రాష్ట్రాలు ఎలా అమలు చేస్తాయని ప్రశ్నించింది.

తీర్పు ప్రాముఖ్యతను అర్థం చేసుకోండి- డిసెంబర్ 14 డెడ్‌లైన్

కేంద్ర ప్రభుత్వం తరఫున హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి- ఈ అంశాన్ని కేంద్రం తీవ్రంగా పరిగణిస్తోందని, తీర్పు అమలు తీరుపై వివరాలు ఇవ్వాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్ని కోరినట్లు తెలిపారు. అయితే ఇప్పటివరకు స్పందన రాలేదని ఆమె కోర్టుకు వివరించారు. దీనిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన ధర్మాసనం- కేంద్రం కోరినా రాష్ట్రాలు ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు తమ తీర్పు ప్రాముఖ్యతను గుర్తించాయని భావిస్తున్నట్లు తెలిపిన ధర్మాసనం- ఆయా రాష్ట్రాలు తీసుకున్న చర్యలకు లిఖితపూర్వక వివరాలు సేకరించాలని కేంద్రాన్ని ఆదేశించింది. తదుపరి విచారణ సమయంలోనూ కొన్ని రాష్ట్రాలైనా స్పందించలేదని కేంద్రం చెబితే, సంబంధిత రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కోర్టు ధిక్కరణ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించింది. చివరిసారిగా అవకాశం ఇస్తూ కేసు విచారణను డిసెంబర్ 14 కు వాయిదా వేసింది. 'మేం తీర్పులో చెప్పిన విషయాలు కేవలం కాగితాలకే పరిమితమైతే, కేంద్రం, రాష్ట్రాలు ఈ ప్రాథమిక హక్కును చిన్నారి బాలికలకు ఎలా అందిస్తాయి? సుదూర ప్రాంతాల్లో రుతుస్రావ పరిశుభ్రత సదుపాయాలు లేక చదువుకు దూరమవుతున్న వేలాది మంది బాలికల సంక్షేమం కోసం ఈ తీర్పు ఇచ్చామని గుర్తించాలి.' అని సుప్రీంకోర్టు తెలిపింది.

పాఠశాలల్లో బాలికల సమస్యలపై దృష్టి

రుతుక్రమ పరిశుభ్రత సమస్యల కారణంగా, సరైన సదుపాయాలు లేనందున ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లోని బాలికలు చదువును మధ్యలోనే మానేస్తున్నారని సుప్రీం కోర్టు పేర్కొంది. అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా చూడటమే తీర్పు ప్రధాన ఉద్దేశాల్లో ఒకటని తెలిపింది. సెప్టెంబర్ 1న ఇచ్చిన ఆదేశాల్లో పాఠశాలల్లో బాలురు, బాలికలకు వేర్వేరుగా ఉండే మరుగుదొడ్లు ఎన్ని ఉన్నాయనే దానితో పాటు, అవి సరిగా ఉన్నాయా లేదా అనే అంశంపై దృష్టి పెట్టాలని స్పష్టం చేసింది. ఇంకా మరుగుదొడ్లకు నీటి సౌకర్యం సరిగా ఉందా లేదా, బాలికలకు ప్రైవసీ, సులభంగా అక్కడికి చేరుకునే సౌకర్యాలు ఉన్నాయో లేదో పరిశీలించాలని ఆదేశించింది. దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లో బాలబాలికలకు విడివిడిగా నీటి సదుపాయం కలిగిన 30458 మరుగుదొడ్లను ఇప్పటికే నిర్మించామని కేంద్ర ప్రభుత్వం గతంలోనే అత్యున్నత న్యాయస్థానానికి తెలియజేసింది. ఇంకా 4236 మరుగుదొడ్ల నిర్మాణం తుది దశలో ఉందని పేర్కొంది. ఇక అంతకుముందు ఈ ఏడాది జనవరి 30న కీలక తీర్పులో కూడా సుప్రీం కోర్టు పలు ఆదేశాలు జారీ చేసింది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు అన్నింట్లోనూ నీటి సౌకర్యంతో కూడిన, వేర్వేరు మరుగుదొడ్లు ఉండాలని స్పష్టం చేసింది. అలానే ప్రతి పాఠశాలలో బాలికలకు శానిటరీ న్యాప్‌కిన్లను ఉచితంగా అందించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఆదేశించింది. వీటి అమలు తీరుపైనే రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వివరాలు కోరింది.

సీఈసీని ఎవరూ కాపాడలేరు

రాజకీయ పార్టీలకు డిజిటల్, ప్రింట్ రూపాల్లో చదవగలిగే (రీడబుల్), శోధించగలిగే (సర్చబుల్) రూపాల్లో ఓటర్ల జాబితాలను అందించాలని ఎన్నికల సంఘం నిర్ణయించడంపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. ఓట్ల దొంగలకు వ్యతిరేకంగా దేశమంతా రోడ్లపైకి వచ్చి పోరాడినదానికి ఫలితంగానే ఈ విజయం దక్కిందని కాంగ్రెస్ ఆదివారం వ్యాఖ్యానించింది. ఇదే సమయంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెంటనే తన పదవి నుంచి తప్పుకోవాలని, ఇంకా వివాదాస్పద ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను తక్షణమే నిలిపి వేయాలన్న తమ డిమాండ్లను పార్టీ మరోసారి గట్టిగా వినిపించింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, కమ్యూనికేషన్స్ ఇన్‌ఛార్జ్ జైరాం రమేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. గత రెండు సంవత్సరాలుగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ– ఎన్నికల సంఘాన్ని ఓటర్ల జాబితాలను సెర్చ్ చేయగలిగే రూపంలో అన్ని రాజకీయ పార్టీలకు అందించాలని నిరంతరం కోరుతున్నారని జైరాం రమేశ్ గుర్తుచేశారు. 2018లో మధ్యప్రదేశ్‌లో లక్షలాది బోగస్ ఓటర్లను కాంగ్రెస్ గుర్తించిన తర్వాత ఎన్నికల సంఘం సెర్చ్ చేయగలిగే ఓటర్ల జాబితాలను అందించడం పూర్తిగా నిలిపివేసిందని ఆయన ఆరోపించారు. అప్పటి నుంచి 8 ఏళ్ల పాటు తాము డిమాండ్లు చేస్తున్నా, వాటిని పట్టించుకోవడం లేదని, దీని వల్లనే ఓట్ చోరీకి అవకాశం ఏర్పడిందని విమర్శించారు.

ఓటర్ల జాబితాలపై ఈసీ కీలక నిర్ణయం

2026, అక్టోబర్ 15న ఎన్నికల సంఘం కీలక ఆదేశాలు జారీ చేసిందని జైరాం రమేశ్ తెలిపారు. రెండేళ్ల విరామం తర్వాత 17 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో తిరిగి ప్రారంభమైన ఓటర్ల జాబితా స్పెషల్ సమ్మరీ రివిజన్ ప్రక్రియ కోసం రాజకీయ పార్టీలకు సెర్చ్ చేయగలిగే రూపంలో ఓటర్ల జాబితాలను అందించాలని నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. దేశవ్యాప్తంగా ఓట్ల చోరీకి వ్యతిరేకంగా ప్రజలు నిరసనలు తెలియజేస్తున్న నేపథ్యంలోనే ఈసీ నుంచి ఈ ప్రకటన వచ్చిందని వ్యాఖ్యానించారు. ప్రతిసారీ ఓట్ల చోరీ ఆరోపణలు బయటపడినప్పుడు కేంద్ర ప్రభుత్వం ఏదో ఒక కొత్త విధానాలను అనుసరిస్తోందని జైరాం రమేశ్ విమర్శించారు. చదవగలిగే ఓటర్ల జాబితాలను నిలిపివేయడం, నకిలీ ఓటర్లను చేర్చడం, సర్ ప్రక్రియ వంటివి ఈ కోవలోకే వస్తాయని స్పష్టం చేశారు. ఈసారి మాత్రం అలా కుదరదని హెచ్చరించారు.

రిస్క్‌లో 13 కోట్లకుపైగా ఓట్లు- సీఈసీ తప్పుకోవాల్సిందే

ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా సూచనల మేరకు నడుచుకుంటూ జ్ఞానేశ్ కుమార్ ఎన్నికల సంఘంపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీశారని జైరాం రమేశ్ ఈ సందర్భంగా ఆరోపించారు. ఆయన ఎట్టి పరిస్థితుల్లోనూ తన పదవి నుంచి తప్పుకోవాల్సిందేనని డిమాండ్ చేశారు. సీఈసీ రాజీనామాతోనే సమస్య పరిష్కారం కాదని, ఎన్నికల సంఘం వ్యవస్థను, దాని ఐటీ వ్యవస్థను కూడా సమూలంగా పునర్‌వ్యవస్థీకరించాలనేదే కాంగ్రెస్ డిమాండ్ అని వెల్లడించారు. సర్ ప్రక్రియ వల్ల సుమారు 13 కోట్ల మందికిపైగా భారతీయుల ఓటు హక్కు ప్రమాదంలో పడిందని రమేశ్ పేర్కొన్నారు. అందుకే ఈ ప్రక్రియను వెంటనే నిలిపివేయాల్సిందిగా కోరారు.

17 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎస్ఎస్ఆర్

మరోవైపు ఎన్నికల సంఘం ఇటీవల 17 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రతి ఏటా నిర్వహించే ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ (ఎస్=) చేపట్టాలని నిర్ణయించింది. ఎస్ఐఆర్‌తో దీనికి సంబంధం లేదు. వచ్చే ఏడాది ప్రారంభంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలు కూడా ఇందులో కొన్ని ఉన్నాయి. ఈ ప్రాంతాల్లో ఓటరు జాబితా మార్పు చేర్పులు చేసి తుది జాబితాను జనవరి 4న ప్రచురించనున్నారు. ఎస్ఎస్ఆర్ అనేది ఎన్నికల సంఘం ఏటా నిర్వహించే సాధారణ ప్రక్రియ అని ఒక సీనియర్ అధికారి వివరించారు. ముఖ్యంగా ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో దీనిని చేపడతారని తెలిపారు. ఈ 17 రాష్ట్రాలు, యూటీల్లో సర్ ప్రకియ ఇప్పటికే పూర్తయిందని చెప్పుకొచ్చారు. ఈ ఎస్ఎస్ఆర్ ప్రక్రియలో భాగంగానే తొలిసారిగా రాజకీయ పార్టీలకు డ్రాఫ్ట్, తుది ఓటర్ల జాబితాలను చదవగలిగే రూపంలో హార్డ్ కాపీలు, సాఫ్ట్ కాపీల రూపంలో అందించనుంది ఈసీ. ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో అభ్యర్థులకు కూడా ఈ జాబితాల్ని అందించాలని నిర్ణయించింది.

భారత్‌లో 11 లక్షలకు పైగా ఉపాధ్యాయులు కొరత

ప్రపంచవ్యాప్తంగా నాణ్యమైన విద్యను అందించడంలో ఉపాధ్యాయుల కొరత ప్రధాన అడ్డంకిగా మారుతోంది. ఐక్యరాజ్యసమితి నిర్దేశించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాల ప్రకారం 2030 నాటికి పిల్లలందరికీ ప్రాథమిక, మాధ్యమిక విద్యను అందించడం, తక్కువ ఖర్చులో ఉన్నత విద్యను కల్పించడం, ఉపాధి అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను అందించాలి. అయితే యునెస్కో ఇటీవల విడుదల చేసిన 'గ్లోబల్ రిపోర్ట్ ఆన్ టీచర్స్' నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ఉపాధ్యాయుల కొరత ఈ విద్యావ్యవస్థను కుదిపేస్తోంది. ప్రీ ప్రైమరీ నుంచి సెకండరీ స్థాయి వరకు ప్రతి చిన్నారికి మెరుగైన విద్య అందించాలంటే 2030 నాటికి మరో 5 కోట్ల మంది ఉపాధ్యాయులు అవసరం అని నివేదికలో వెల్లడించింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా సుమారు 10.7 కోట్ల మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, ప్రతి ఇద్దరు ఉపాధ్యాయులకు అదనంగా మరో ఉపాధ్యాయుడు అవసరమయ్యే పరిస్థితి ఉందని నివేదిక పేర్కొంది.

ఉపాధ్యాయుల నియామకానికి ఏటా రూ.10.14 లక్షల కోట్లు

ఉపాధ్యాయుల కొరతను అధిగమించడానికి కొత్త నియామకాలు చేపట్టడం, ఖాళీలను భర్తీ చేయడం, వేతనాలు చెల్లించడం వంటి వాటికి భారీగా నిధులు అవసరం అవుతాయని యునెస్కో నివేదిక తెలిపింది. 2030 నాటికి విద్య లక్ష్యాల్ని చేరుకోవాలంటే ప్రపంచవ్యాప్తంగా ఏటా సుమారు రూ. 10.14 లక్షల కోట్ల నిధులు అవసరం అని అంచనా వేసింది. ఉపాధ్యాయుల కొరత కారణంగా ప్రస్తుతం ఆ వృత్తిలో ఉన్న వారిపై పనిభారం పెరుగుతోంది. దీని వల్ల విద్యార్థులపై వ్యక్తిగత శ్రద్ధ తగ్గడం, బోధనలో నాణ్యత దెబ్బతినడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయి. పేద దేశాలు, ముఖ్యంగా సబ్-సహారా ఆఫ్రికా ప్రాంతంలో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉందని యునెస్కో నివేదిక వెల్లడించింది. నైజీరియా, ఘనా, కాంగో రిపబ్లిక్, కామెరూన్, కెన్యా, జింబాబ్వే, మొజాంబిక్, జాంబియా వంటి దేశాలతో కూడిన సబ్ సహారా ఆఫ్రికా ప్రాంతంలో ప్రాథమిక విద్యకు 2030 నాటికి అత్యధికంగా 43.91 లక్షల మంది ఉపాధ్యాయులు అవసరం అవుతారని అంచనా వేసింది. ఇంకా మయన్మార్, ఇండోనేసియా, మలేసియా వంటి దేశాలు ఉన్న ఆగ్నేయాసియా ప్రాంతంలో మరో 30.50 లక్షల మంది ఉపాధ్యాయులు అవసరమని పేర్కొంది.

సెకండరీ ఎడ్యుకేషన్‌కు 3.11 కోట్ల మంది కొత్త టీచర్లు

9, 10 తరగతుల విద్యార్థులకు మెరుగైన విద్య అందించడానికి ప్రపంచవ్యాప్తంగా 2030 నాటికి సుమారు 3.11 కోట్ల మంది కొత్త ఉపాధ్యాయులు అవసరమవుతారని నివేదిక తెలిపింది. ఈ సెకండరీ విద్యకు సంబంధించి సబ్ సహారా ఆఫ్రికా దేశాలకు 1.06 కోట్ల మందికిపైగా ఉపాధ్యాయులు అవసరం. భారత్‌తో పాటు ఇతర దేశాలు ఉన్న దక్షిణాసియాకు 67.16 లక్షల మంది, మధ్య ఆసియాకు 6.51 లక్షల మంది కొత్త ఉపాధ్యాయులు అవసరం అని అంచనా వేసింది. కొత్తగా నియమించాల్సిన ఉపాధ్యాయుల్లో 58 శాతం మంది ఇప్పటికే వృత్తిలో ఉన్న వారు ఉద్యోగాలు వదిలి వెళ్లడం వల్ల ఏర్పడే ఖాళీలను భర్తీ చేసేందుకే అవసరం అవుతాయని యునెస్కో తెలిపింది. తక్కువ వేతనాలు, అధిక పనిభారం, వృత్తిపరంగా తగినంత గౌరవం లేకపోవడం వంటి అంశాలు ఉపాధ్యాయులు ఉద్యోగాలు వదిలివెళ్లడానికి కారణాలుగా నివేదిక ప్రస్తావించింది. 2024లో ఒక సర్వే ప్రకారం ప్రపంచంలోని 75 శాతం దేశాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల్లో 40 శాతం కంటే తక్కువ మంది మాత్రమే తమ వృత్తికి సమాజంలో గౌరవం ఉందని భావిస్తున్నారు. వృత్తికి గౌరవం లభిస్తున్నప్పుడు ఉపాధ్యాయులు వచ్చే ఐదేళ్లలో ఉద్యోగాన్ని వదిలే అవకాశం 10 శాతానికిపైగా తగ్గుతుందని నివేదిక పేర్కొంది. వివిధ దేశాల్లో ఉపాధ్యాయులకు అందుతున్న నెలవారీ వేతనాల్ని కూడా యునెస్కో రిపోర్ట్ పోల్చింది. 2015 డాలర్ విలువ ఆధారంగా, 2023 గణాంకాల ప్రకారం ఖతార్‌లో ఉపాధ్యాయులకు నెల జీతం సుమారు రూ. 97,164 గా ఉంది. నేపాల్‌లో ఇది రూ. 26321 గా ఉంది. భారత్‌కు సంబంధించి 2019 డేటా ప్రకారం ఉపాధ్యాయుల సగటు నెల వేతనం రూ. 25,232 గా ఉంది. ఇక్కడ కూడా 40 శాతం దేశాల్లో ఉపాధ్యాయులకు వారి అర్హతలకు తగిన వేతనాలు అందట్లేదని నివేదిక గుర్తించింది.

భారత్‌లో 11 లక్షలకుపైగా ఉపాధ్యాయుల కొరత

భారత్‌లోని స్కూళ్లలో ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు 11 లక్షలకుపైగా ఉపాధ్యాయుల కొరత ఉందని యునెస్కో గత నివేదిక తెలిపింది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఈ సమస్య తీవ్రంగా ఉందని తెలిపింది. యూపీ, మధ్యప్రదేశ్, బిహార్, రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల్లో టీచర్ల కొరత ఎక్కువగా ఉన్నట్లు వివరించింది.

నీటి ఎద్దడి సమస్య తీవ్రతరం



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో నీటి ఎద్దడి సమస్య తీవ్రతరం అవుతున్న నేపథ్యంలో, ప్రభుత్వం ఈ సమస్యను ఎదుర్కొనేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావం ఏర్పడటంతో, రాష్ట్రంలో 11.18 లక్షల ఎకరాల్లో పంటలు నష్టపోతున్నాయని అంచనా వేయబడింది. ఈ క్రమంలో, వివిధ శాఖల అధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికలు అందించారు. గురువారం జరిగిన సమావేశంలో, కరవు పరిస్థితులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ప్రభుత్వానికి పలు ప్రత్యామ్నాయాలను ప్రతిపాదించారు. గత సంవత్సరం 69.19 లక్షల ఎకరాల్లో సాగు చేసిన వరి, ఈ సంవత్సరం 57.04 లక్షల ఎకరాలకు తగ్గింది. నీటి ఎద్దడి కారణంగా పత్తి, వరి పంటలపై తీవ్ర ప్రభావం పడింది. నల్గొండ, జోగులాంబ గద్వాల, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి జిల్లాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. ముఖ్యంగా 8.93 లక్షల ఎకరాల్లో పత్తి, 1.20 లక్షల ఎకరాల్లో వరి పంటలపై తీవ్ర ఒత్తిడి ఉంది. ఈ పరిస్థితులను అధిగమించేందుకు, ప్రభుత్వం రూ.1,986.89 కోట్ల నిధులను అవసరమని అధికారులు ప్రతిపాదించారు. పశుసంవర్ధక శాఖ నుంచి రూ.86.39 కోట్లు అవసరమని పేర్కొన్నారు.కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల్లో ప్రస్తుతం 270 టీఎంసీల నిల్వ సామర్థ్యానికి, 78.5 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఇది 71 శాతం లోటు సూచిస్తుంది. గోదావరి నదీ పరివాహక ప్రాజెక్టుల్లో 145.7 టీఎంసీలకు 34 శాతం లోటుతో 96.0 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ముఖ్యంగా సింగూరు జలాశయంలో ప్రస్తుతం కేవలం 3.924 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఇది డిసెంబర్ వరకు సరిపోతుందని అంచనా. రాష్ట్రంలోని చెరువుల్లో 40 శాతం వాటిలో నాలుగో వంతు కంటే తక్కువ నీరు ఉంది. అందువల్ల, అందుబాటులో ఉన్న నీటిని ప్రధానంగా తాగునీటి అవసరాలకు కేటాయించాలని అధికారులు ప్రతిపాదించారు. మిగులు ఉన్న చోట పంటలకు తడి సాగునీరు అందించాలని సూచించారు. సింగూరు, ఎస్సార్ఎస్పీ, కాళేశ్వరం, మిడ్ మానేరు, జూరాల, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి నీటి విడుదలను వాయిదా వేయాలని సూచించారు. డిండి, ఎస్సార్ఎస్పీ ప్రాజెక్టుల పరిధిలోని ఎత్తిపోతల ద్వారా నీటి నిల్వను పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.రాష్ట్రంలో 34 జలాశయాల ద్వారా 24,001 గ్రామీణ ఆవాసాలకు, 145 పట్టణ స్థానిక సంస్థలకు నీటిని సరఫరా చేస్తున్నారు. సింగూరు జలాశయంలో నీటి నిల్వ 3.92 టీఎంసీలకు పడిపోవడంతో అదనపు పంపులను ఏర్పాటు చేసేందుకు రూ.84.14 కోట్ల వ్యయంతో ఓ ప్రత్యామ్నాయ ప్రణాళికను సిద్ధం చేశారు. ఏడాది పొడవునా తాగునీటి అవసరాలను తీర్చడానికి అన్ని జలాశయాల్లో తగినంత నీటిని నిల్వ ఉంచాలని, గ్రామాల్లోని చెరువుల్లో పశువుల కోసం తగినంత నీరు ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రతిపాదించారు. అత్యవసర నీటి సరఫరా అవసరాల కోసం ప్రతి జిల్లా కలెక్టర్ దగ్గర రూ.1 కోటి నిధిని అందుబాటులో ఉంచాలని ప్రతిపాదించారు. హైదరాబాద్ మెట్రోపాలిటన్ పరిధిలో 14.5 లక్షల నల్లా కనెక్షన్ల ద్వారా 1.30 కోట్ల మందికి తాగునీరు అందుతోంది. ఈ ఏడాది డిసెంబర్ నాటికి సింగూరు, మంజీరా జలాశయాల పరిధిలో నీటి సరఫరా కొరత ఏర్పడే అవకాశం ఉందని అంచనా. దీనిని దృష్టిలో ఉంచుకొని రూ.57.55 కోట్ల వ్యయంతో 9 ప్రత్యామ్నాయ ప్రణాళికల ఆమోదానికి ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు.

5 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం!

తెలంగాణ రాష్ట్రంలో రైతులు ఇప్పటికే వర్షాభావం మరియు నీటి కొరత కారణంగా పంటల కాపాడుకోవడంలో కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఈ క్రమంలో, తెగుళ్ల సమస్య కూడా రైతులకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో సుమారు 5 లక్షల ఎకరాల్లో పంటలు వివిధ రకాల తెగుళ్ల బారిన పడుతున్నాయి. వ్యవసాయ శాఖ ఈ విషయాన్ని గుర్తించింది. రైతులు ఈ సమస్య వల్ల మరింత నష్టం వాటిల్లుతుందేమోనని తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం చాలా జిల్లాల్లో వరి పంట అంకుర దశకు చేరుకుంది. కొన్ని జిల్లాల్లో కాత మొదలవుతోంది. వర్షాలు లేకపోవడంతో, వరి పొలాల్లో ఆకు ఎండు తెగులు, కాండం తొలిచే పురుగులు, ఆకు ముడత తెగుళ్లు మొదలయ్యాయి. వరంగల్, కరీంనగర్, జగిత్యాల, ములుగు, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, నిర్మల్, కొత్తగూడెం, సూర్యాపేట, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల్లో సుమారు 2.5 లక్షల ఎకరాల్లో ఈ తెగుళ్ల సమస్య తీవ్రంగా ఉంది. రైతులు తమ పంటలను కాపాడుకోవడానికి అనేక ప్రయత్నాలు చేస్తున్నారు, కానీ ఫలితం లేకుండా పోతున్నాయి. ప్రభాకర్ రావు అనే రైతు, వరంగల్ జిల్లాలో 4 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నాడు. అతను చెప్పినట్లుగా, విపరీతమైన ఎండలు మరియు వర్షాభావం కారణంగా పంట తెగుళ్ల బారిన పడింది. అరికట్టడానికి రూ.25 వేలతో పురుగు మందులు పిచికారీ చేశాడు, కానీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయింది. ఈ పరిస్థితి రైతులకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.ఇంకా, పత్తి పంట ప్రస్తుతం కాయలు పగిలి దూది బయటకు వచ్చే దశలో ఉంది. ఈ సమయంలో, ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, మహబూబ్‌నగర్, మెదక్, ఖమ్మం జిల్లాల్లో సుమారు లక్ష ఎకరాల్లో గులాబీ రంగు పురుగు, తామర పురుగులు, పచ్చ పురుగుల దాడి కనిపిస్తోంది. ఈ తెగుళ్లు మొక్కల ఆకులు, కాండం, వేర్లు కుళ్ళిపోయి మొక్కలు వాడిపోతున్నాయి. కాయల్లో పత్తి నాణ్యత మరియు దిగుబడి కూడా తగ్గుతోంది. శంకర్ అనే రైతు, మహబూబాబాద్ జిల్లాలో రెండు ఎకరాల్లో పత్తిని సాగుచేస్తున్నాడు. వర్షాలు లేకపోవడంతో, బావి నీళ్లతోనే పంటను బతికిస్తున్నాడు. కానీ ఇటీవల పంటకు గులాబీరంగు తెగులు వస్తున్నాయి. దీనివల్ల కాయ నుంచి పత్తి రావటం లేదు. దీంతో దిగుబడి రాదేమోనని భయంగా ఉంది. మొక్కజొన్న పంట కూడా ప్రస్తుతం పాల దశ దాటి గింజ గట్టిపడే దశకు చేరుకుంది. ఈ సమయంలోనే వర్షాలు లేకపోవటంతో కాండం కుళ్లు తెగులు, ఆకుమచ్చ తెగులు, కుంకుమ తెగుళ్లు వస్తున్నాయి.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5.30 లక్షల ఎకరాల్లో కంది పంటకు పురుగుల బెడద ఏర్పడింది. ముఖ్యంగా కాయ తొలిచే పురుగు సోకింది. సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల్లో సుమారు 72,000 ఎకరాల్లో ఈ పురుగు కాయలను పాడు చేస్తోంది. ఉమ్మడి మహబూబ్‌నగర్?, రంగారెడ్డి జిల్లాల్లో సుమారు 12,000 ఎకరాల వేరుశనగ పంటకు పొగాకు లద్దె పురుగు సోకింది. మిరప, టమోటా, వంకాయ బంతి పూల పంటలకు సంబంధించి మరో 22,000 ఎకరాల్లో మొక్క కుళ్లు తెగులు తీవ్ర సమస్యగా మారింది. ఈ నేపథ్యంలో, పంట నష్టాన్ని నివారించేందుకు రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. వారు క్షేత్రస్థాయిలో పర్యటించి, రైతులకు నివారణ నియంత్రణ చర్యల గురించి వివరించాలని సూచించారు.

పార్టీ ప్రభావం తక్కువ.. అభ్యర్థి ప్రభావం ఎక్కువ..

వ్యూహాత్మకంగా కాంగ్రెస్ పార్టీ అడుగులు



హైదరాబాద్ : తెలంగాణలో రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వేడి అప్పుడే రాజకీయ వర్గాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. ఎమ్మెల్సీ పోరుకు సంబంధించి అధికార కాంగ్రెస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ ముందస్తు ప్రచారంలో జోరు పెంచగా, ప్రతిపక్ష బీఆర్ఎస్ , బిజెపి మాత్రం ఇప్పటికీ తమ అభ్యర్థులను ఖరారు చేయలే మల్లగుల్లాలు పడుతున్నాయి. పట్టభద్రుల ఎన్నికల్లో సాధారణ ఎన్నికల మాదిరిగా కాకుండా ఓటర్ల నమోదు ప్రక్రియే అత్యంత కీలకం కావడం, అభ్యర్థి ఎవరో తేలితే తప్ప క్షేత్రస్థాయి క్యాడర్‌లో పూర్తిస్థాయిలో ఉత్సాహం రాకపోవడంతో ఆయా పార్టీల్లో అంతర్గత చర్చలు తుదిదశకు చేరుకున్నాయి.అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తోంది. అభ్యర్థుల ఎంపికలో వేగం పెంచడమే కాకుండా, గ్రాడ్యుయేట్ ఓటర్ల నమోదు బాధ్యతను నియోజకవర్గాల వారీగా ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జులకు అప్పగించింది. పట్టభద్రులను నేరుగా కలిసి ఓటర్లుగా నమోదు చేయించడంలో కాంగ్రెస్ శ్రేణులు ఇప్పటికే క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్నాయి. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, ఉద్యోగ నియామకాల ప్రచారాన్ని పట్టభద్రుల వద్దకు తీసుకెళ్తూ, ఓటర్ల నమోదును ఓ సవాలుగా తీసుకుని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ప్రచారంలో ముందంజలో ఉన్నాయి.మరోవైపు బీజేపీలో పట్టభద్రుల ఎమ్మెల్సీ టికెట్ కోసం తీవ్ర పోటీ నెలకొంది. గతంలో హైదరాబాద్–రంగారెడ్డి– మహబూబ్‌నగర్ పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు మళ్లీ రేసులో ముందున్నారనే ప్రచారం బలంగా సాగుతోంది. ఆయనతో పాటు పార్టీ ముఖ్య నేతలు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు కూడా టికెట్ రేసులో ఉండటంతో అభ్యర్థిత్వం కొలిక్కిరావడం లేదు. ముగ్గురు చొప్పున అభ్యర్థుల పేర్లతో కూడిన నివేదికలను రాష్ట్ర కమిటీ కేంద్ర నాయకత్వానికి పంపినట్లు సమాచారం. అయితే, పార్టీ అభ్యర్థిపై అధికారిక స్పష్టత వచ్చే వరకు స్థానిక క్యాడర్ సంపూర్ణంగా ఓటర్ల నమోదు ప్రక్రియలో పాల్గొనలేకపోతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. విపక్ష బీఆర్ఎస్ పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. వరుస ఎన్నికల పరాజయాల తర్వాత గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానాన్ని దక్కించుకోవడం ద్వారా మళ్లీ పుంజుకోవాలని ఆ పార్టీ భావిస్తోంది. అయితే పట్టభద్రుల నియోజకవర్గాలు విస్తారంగా ఉండటంతో పాటు ప్రచార వ్యయం కూడా అధికంగా ఉండే అవకాశం ఉండటంతో, ఆర్థికంగా బలంగా ఉన్న నేతల వైపే అధిష్టానం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో పట్టు ఉండి, ఆర్థిక వనరులను సమకూర్చుకోగల సీనియర్ నేతలతో బీఆర్ఎస్ అధిష్టానం సంప్రదింపులు జరుపుతోంది. సరైన అభ్యర్థి దొరకడంలో జరుగుతున్న జాప్యం వల్ల జిల్లాల్లో బీఆర్ఎస్ క్యాడర్ దిశానిర్దేశం లేక వేచిచూసే ధోరణిలోనే ఉండిపోయింది.పట్టభద్రుల ఎన్నికల్లో పార్టీ గుర్తు కంటే అభ్యర్థి వ్యక్తిగత ఇమేజ్, విద్యావంతులలో ఉన్న ప్రజాదరణ, ముందస్తు ప్రచారమే ప్రధాన పాత్ర పోషిస్తాయి. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఓటర్ నమోదులో వేగం చూపిస్తుంటే, బిజెపి అర్బన్ ప్రాంతాల్లో ఉన్న తన సాంప్రదాయ ఓటు బ్యాంకుపై ధీమాతో ఉంది. ఇక బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వ వ్యతిరేక ఓటును ఆకర్షించాలని చూస్తోంది. కానీ, అభ్యర్థుల ప్రకటన ఆలస్యమయ్యే కొద్దీ ఆయా పార్టీల క్యాడర్‌లో క్రియాశీలత తగ్గి, ఓటర్ల నమోదు ప్రక్రియ మందగించే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమరం రోజురోజుకూ ఆసక్తికరంగా మారుతోంది. కాంగ్రెస్ తన స్పీడ్‌తో ప్రత్యర్థులపై ఒత్తిడి పెంచుతుంటే, బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు వీలైనంత త్వరగా అభ్యర్థులను ఖరారు చేసి ప్రకటన విడుదల చేయాలని భావిస్తున్నాయి. రాబోయే కొద్ది రోజుల్లో ప్రధాన పార్టీలన్నీ అభ్యర్థులను రంగంలోకి దించితే తప్ప పట్టభద్రుల నియోజకవర్గాల్లో అసలైన పొలిటికల్ హీట్ మొదలయ్యే అవకాశం కనిపించడం లేదు

సెక్షన్ 22-ం ప్లాట్ల రిజిస్ట్రేషన్లకు సాఫ్ట్‌వేర్ మోక్షం!

హైదరాబాద్ : తెలంగాణలో సరైన అనుమతులు, అప్రూవ్డ్ లేఅవుట్లు ఉన్నప్పటికీ, సెక్షన్ 22-ం చట్టపరమైన ఆంక్షల కారణంగా సంవత్సరాలుగా రిజిస్ట్రేషన్లు కాకుండా ఆగిపోయిన వేలాది ఆస్తుల యజమానులకు రాష్ట్ర ప్రభుత్వం ఊరట కల్పించనుంది. చట్టబద్ధమైన ప్లాట్లు ఉన్నప్పటికీ సాంకేతిక, రికార్డు లోపాల వల్ల క్రయవిక్రయాలు జరగక ఇబ్బంది పడుతున్న సామాన్యుల కష్టాలను తొలగించేందుకు రెవెన్యూ శాఖ రంగంలోకి దిగింది. ఈ సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం చూపే దిశగా రిజిస్ట్రేషన్ శాఖ ప్రత్యేకంగా ఒక సరికొత్త సాఫ్ట్‌వేర్ మాడ్యూల్‌ను సిద్ధం చేస్తోంది.గతంలో ప్రభుత్వ భూములు, వివాదాస్పద స్థలాలు లేదా ఇనామ్ భూముల ముసుగులో చాలా వరకు చట్టబద్ధమైన లేఅవుట్లు కూడా సెక్షన్ 22-ం జాబితాలో చేరిపోయాయి. దీనివల్ల పక్కా ప్లాట్లు కొనుగోలు చేసిన మధ్యతరగతి ప్రజలు, చిన్న రియల్టర్లు తమ ఆస్తులను అమ్ముకోలేక, బ్యాంకుల నుంచి గృహ రుణాలు పొందలేక తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారం దొరకని ఈ దీర్ఘకాలిక సమస్యను గుర్తించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం, అర్హమైన ఆస్తులను ఆ నిషేధిత జాబితా నుంచి తొలగించడానికి పకడ్బందీ విధివిధానాలను రూపొందించింది.ఈ సమస్యను పూర్తిగా పరిష్కరించే ఉద్దేశంతోనే స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ ఒక అత్యాధునిక సాఫ్ట్‌వేర్ మాడ్యూల్‌ను అభివృద్ధి చేస్తోంది. దీని ద్వారా ఎంపిక చేసిన ఆస్తులకు సంబంధించిన అసలైన డాక్యుమెంట్లు, ఆమోదించిన లేఅవుట్ పత్రాలు, రెవెన్యూ రికార్డులను ఈ కొత్త పోర్టల్‌లో డిజిటలైజ్ చేసి పరిశీలిస్తారు. అన్ని అర్హతలు సక్రమంగా ఉన్నట్లు తేలితే, ఆటోమేటిక్‌గా ఆ ప్లాట్లను 22-ం నిషిద్ధ జాబితా నుంచి తొలగించేలా ఈ సాఫ్ట్‌వేర్‌ను డిజైన్ చేశారు. దీనివల్ల అవినీతికి ఆస్కారం లేకుండా, మానవ ప్రమేయం లేకుండా పారదర్శకంగా క్లియరెన్స్ లభిస్తుంది.ఈ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ మాడ్యూల్ అందుబాటులోకి వస్తే, రాష్ట్రవ్యాప్తంగా చిక్కుల్లో పడి ఉన్న వేల ఎకరాల ఆస్తుల క్రయవిక్రయాలకు మార్గం సుగమమవుతుంది. రియల్ ఎస్టేట్ రంగంలో ఊచకోత కోస్తున్న నిరుత్సాహం తొలగిపోయి, లావాదేవీలు మళ్లీ పుంజుకుంటాయని నిపుణులు భావిస్తున్నారు. తద్వారా వేలాది మంది గృహ కొనుగోలుదారులకు చట్టబద్ధమైన యాజమాన్య హక్కులు దక్కడంతో పాటు ప్రభుత్వానికి కూడా రిజిస్ట్రేషన్ల రూపంలో భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

దసరా పండుగ సందర్భంగా ఓపీ సేవలు

వరంగల్ : ప్రభుత్వం ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తోంది. ఈ క్రమంలో వరంగల్?లోని సూపర్? స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణాన్ని పూర్తి చేసి, దసరా పండుగ సందర్భంగా ఓపీ సేవలను ప్రారంభించడానికి సిద్ధమవుతోంది. వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రి భవనం ప్రస్తుతం శిథిలావస్థకు చేరింది. ఈ నేపథ్యంలో, ప్రభుత్వం త్వరగా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనంలో వైద్య విభాగాలను తరలించి, సేవలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా ఇన్?ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. 24 అంతస్తులతో నిర్మితమవుతున్న ఈ ఆస్పత్రిలో ముందుగా ఓపీ సేవలను ప్రారంభించాలని నిర్ణయించారు. ఈ ఏడాది దసరా నుంచి సేవలు అందుబాటులోకి రానున్నాయి. నవంబర్ చివరి నాటికి లేదా డిసెంబర్‌లో పూర్తిగా వైద్య సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. గురువారం, మంత్రి సీతక్క మరియు పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి నూతన ఆస్పత్రి భవనాన్ని పరిశీలించారు. ఓపీ సేవలను ప్రారంభించేందుకు అవసరమైన ఏర్పాట్లు మరియు జాగ్రత్తలపై ఆమె కొన్ని సూచనలు చేశారు.మాజీ బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం జీవోలు ఇచ్చి నిర్మాణాలను అసంపూర్తిగా వదిలేసిందని మంత్రి సీతక్క ఆరోపించారు. నిర్మాణాలను మొండి గోడల దశలో విడిచిపెట్టారని ఆమె పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అనేక ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొని, ఆటంకాలు లేకుండా నిర్మాణాన్ని పూర్తి చేశామని ఆమె వెల్లడించారు. మంత్రుల వెంట ఎంపీ బలరాం నాయక్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, కుడా చైర్మన్ సుధారాణి, కలెక్టర్‌లు సత్య శారద, చాహత్‌భాజ్‌పాయ్ తదితరులు ఉన్నారు.వరంగల్ సెంట్రల్ జైలు స్థలంలో 56 ఎకరాల విస్తీర్ణంలో రూ.1,150 కోట్ల వ్యయంతో 2021లో ఈ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనులు ప్రారంభించారు. ప్రస్తుతం ఈ నిర్మాణ పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఈ ఆస్పత్రిలో దశల వారీగా మొత్తం 2,208 పడకల సామర్థ్యంతో వైద్య సేవలు అందించనున్నారు. అన్ని విభాగాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే ఉమ్మడి వరంగల్?, ఆదిలాబాద్?, కరీంనగర్? జిల్లాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రకు చెందిన పేద ప్రజలకు ఆధునిక వైద్య సేవలు అందించబడతాయి. ఈ సూపర్? స్పెషాలిటీ భవనంలోని 9 అంతస్తులను వైద్య సేవలకు వినియోగించేందుకు ప్రణాళిక వేసారు. అయితే ప్రస్తుతం కేవలం ఆరు అంతస్తులలోనే పనులు పూర్తయ్యాయి. మిగతా అంతస్తుల్లో సివిల్ పనులు మిగిలి ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎంజీఎం ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరడంతో తరచూ ఏదో ఒక ఘటన జరుగుతోంది. ఈ కారణంగా, త్వరగా ఇక్కడి వైద్య సేవలను కొత్త భవనంలోకి మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. దసరా రోజున రెండు అంతస్తుల్లో ముందుగా 22 విభాగాలకు సంబంధించిన ఓపీ సేవలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పూర్తిగా అందుబాటులోకి వస్తే, మొత్తం 37 విభాగాలకు సంబంధించిన వైద్య సేవలను అందించనున్నారు. సంతాన లేమి, అవయవ దానం, అవయవ మార్పిడి వంటి సమస్యలకు ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తోంది.

దసరాకు హైడ్రా పోలీస్ స్టేషన్

హైదరాబాద్ : హైడ్రా పరిధిలోని సరస్సులు, చెరువులు, రోడ్లు, పార్కులు, లేఅవుట్‌లలోని ఖాళీ స్థలాలను ఆక్రమించిన వారిపై క్రిమినల్? కేసులు నమోదు చేయడానికి హైడ్రా పోలీస్? స్టేషన్? సిద్ధమవుతోంది. ఇటీవల అమల్లోకి వచ్చిన క్యూర్? చట్టంతో, హైడ్రా కోసం ప్రత్యేక పోలీస్? స్టేషన్? ఏర్పాటు చేయడం, అధికారాలపై స్పష్టత ఇవ్వడం జరిగింది. అయితే, ఈ చట్టాన్ని ఎలా అమలు చేయాలో సంబంధించి మార్గదర్శకాలు త్వరలో విడుదల కానున్నాయి. దసరా పండుగకు ముందు లేదా పండుగ తర్వాత ఈ కార్యకలాపాలు ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో, హైడ్రా, మూడు మున్సిపల్? కార్పొరేషన్ల అధికారుల కోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాల్లో హైడ్రా పరిధి, క్యూర్? చట్టం కల్పించిన అధికారాలు, వాటిని ఎలా అమలు చేయాలో వివరిస్తారు. సెక్షన్? 241(3) ప్రకారం, క్యూర్? చట్టంలోని 28వ అధ్యాయం, సెక్షన్? 241(3) హైడ్రా స్పష్టం చేస్తోంది. ఈ సెక్షన్ల కింద క్రిమినల్? కేసులు నమోదు చేయవచ్చు. ప్రభుత్వ ఉద్యోగి విధులను అడ్డుకోవడం, ఉద్యోగిపై దాడి చేయడం, జలాశయాలను కలుషితం చేయడం వంటి చర్యలకు ఈ సెక్షన్లు వర్తిస్తాయి. అయితే, ప్రజలు ఇచ్చిన ఫిర్యాదుల ఆధారంగా లేదా కమిషనర్? సిఫార్సుతో కేసులు నమోదు చేయాలా అనే విషయాన్ని ప్రభుత్వం స్పష్టం చేయాల్సి ఉంది. ఈ కేసులపై నాంపల్లిలోని తొమ్మిది మెట్రోపాలిటన్? మెజిస్ట్రేట్? కోర్టులో విచారణ జరగనుంది. ప్రభుత్వ భూముల ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు ఇచ్చే ఫిర్యాదుల ఆధారంగా హైడ్రా చర్యలు తీసుకుంటుందని కమిషనర్? ఏవీ.రంగనాథ్? తెలిపారు. కప్రా చెరువు పునరుద్ధరణ పనులు పూర్తయ్యాయని, రూ.35 కోట్ల ఖర్చుతో చేపట్టిన ఈ పనులు 450 రకాల వలస పక్షులకు ఆవాసంగా మారాయని హైడ్రా బుధవారం మీడియాకు వెల్లడించింది. హైడ్రా ఇప్పటికే వందల ఎకరాల భూములను, పలు చెరువులు, పార్కులు, నాలాలు అన్యాక్రాంతం కాకుండా సంరక్షించిందని కమిషనర్? రంగనాథ్? వివరించారు. వేర్వేరు పోలీస్ స్టేషన్‌లో 50కి పైగా కేసులు విచారణలో ఉన్నాయని ఆయన తెలిపారు. హైడ్రా పోలీస్ స్టేషన్?అందుబాటులోకి వస్తే, ఆయా కేసులన్నీ హైడ్రాకు బదిలీ అవుతాయని గతంలో వివరించారు. కొత్త కేసులు వేగంగా నమోదవుతాయని రంగనాథ్ పేర్కొన్నారు. సమస్య మూలాల్లోకి వెళ్లి చెరువుల ఆక్రమణలను అడ్డుకోవడం, నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ ఆస్తులను కొల్లగొడుతున్న అధికారులను, సిబ్బందిని, ఆక్రమణదారులను పక్కా ఆధారాలతో జైలుకు పంపడమే లక్ష్యమని రంగనాథ్ తెలిపారు.



బిజినెస్

ఆఫీస్ అద్దెకు రూ.189 కోట్లు.. జపాన్ కంపెనీ భారీ డీల్!



భారతదేశంలో రియల్ ఎస్టేట్ మార్కెట్ గణనీయంగా అభివృద్ధి చెందుతోంది. దీంతో దేశంలోని ప్రధాన నగరాల్లో ఆఫీసులు లీజుకు తీసుకోవడానికి భారీ మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోంది. తాజాగా.. జపాన్‌కు చెందిన ఒక కంపెనీ ఏకంగా రూ.189 కోట్ల డీల్ కుదుర్చుకుంది. జపాన్‌కు చెందిన ప్రముఖ బ్యాంకింగ్ సంస్థ సుమిటోమో మిత్సుయ్ బ్యాంకింగ్ కార్పొరేషన్ (ఎస్‌ఎంబీసీ) ముంబైలో ఆఫీస్ స్థలాన్ని లీజుకు తీసుకుంది. ముంబైలోని బాంద్రా-కుర్లా కాంప్లెక్స్ (బీకేసీ)లో దాదాపు 50 వేల చదరపు అడుగుల కార్యాలయ స్థలాన్ని ఐదేళ్ల కాలానికి అద్దెకు తీసుకుంది. ఈ ఒప్పందం మొత్తం విలువ సుమారు రూ.189 కోట్లు కావడం గమనార్హం. జపాన్‌కు చెందిన సుమిటోమో రియల్టీ అండ్ డెవలప్‌మెంట్ కంపెనీ భారత విభాగమైన గోయిసు రియల్టీ ప్రైవేట్ లిమిటెడ్ ఈ స్థలాన్ని లీజుకు ఇచ్చింది. బీకేసీలోని సుమిటోమో జ65 అనే వాణిజ్య భవనంలో 49,820 చదరపు అడుగుల స్థలాన్ని ఎస్‌ఎంబీసీ తీసుకుంది.

ఏడాదికి రూ.41.5 కోట్లు!

ఈ ఒప్పందం 2026 అక్టోబర్ 6న కుదిరింది. చదరపు అడుగుకు నెలకు రూ.694 చొప్పున అద్దె నిర్ణయించారు. ఈ లెక్కన నెలకు సుమారు రూ.3.46 కోట్లు, ఏడాదికి దాదాపు రూ.41.5 కోట్ల అద్దె చెల్లించాల్సి ఉంటుంది. ఒప్పందం ప్రకారం ప్రతి మూడేళ్లకు అద్దె 15 శాతం పెరుగుతుంది. కాగా.. సెక్యూరిటీ డిపాజిట్ రూ.35.11 కోట్లు. ఈ ఒప్పందంలో తొమ్మిది నెలల అద్దె మినహాయింపు కూడా ఉంది. అంటే ఆ కాలానికి అద్దె చెల్లించాల్సిన అవసరం లేదు. అద్దె చెల్లింపులు 2027 జూన్ నుంచి ప్రారంభం కానున్నాయి. జపాన్‌కు చెందిన సుమిటోమో రియల్టీ సంస్థ భారత్‌లో తన వ్యాపారాన్ని విస్తరిస్తోంది. గతంలో ఇదే సంస్థ అభివృద్ధి చేస్తున్న బీకేసీలోని మరో వాణిజ్య భవనంలో అమెరికాకు చెందిన జేపీ మోర్గాన్ ప్రైవేట్ లిమిటెడ్ 1.16 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని లీజుకు తీసుకుంది. ఇందుకు నెలకు సుమారు రూ.6.91 కోట్ల అద్దె నిర్ణయించారు. ముంబైలోని బీకేసీ దేశంలోనే అత్యంత ఖరీదైన వాణిజ్య ప్రాంతాల్లో ఒకటి. ఇక్కడ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఆదాయపు పన్ను శాఖ, జీఎస్టీ కార్యాలయాలు, అమెరికా కాన్సులేట్‌తో పాటు ప్రముఖ హోటళ్లు ఉన్నాయి. గూగుల్, యాపిల్, అమెజాన్, నెట్‌ఫ్లిక్స్, టెస్లా, జియో వంటి పెద్ద కంపెనీలు కూడా ఈ ప్రాంతంలో తమ కార్యాలయాలను నిర్వహిస్తున్నాయి.

ఆర్థిక ఫలితాలు కీలకం

పశ్చిమాసియా సంక్షోభంపైనా మదుపర్ల నజర్



దేశీయ స్టాక్ మార్కెట్లు పడుతూ.. లేస్తూ సాగుతున్నాయి. అయినప్పటికీ అంతకుముందు వారం ముగింపుతో పోల్చితే గత వారం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 2,256.94 పాయింట్లు లేదా 3.11 శాతం ఎగిసి 74,729.27 వద్ద నిలిచింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 625.70 పాయింట్లు లేదా 2.77 శాతం పెరిగి 23,146.15 దగ్గర ఆగింది. ఇక ఈ వారం విషయానికొస్తే.. ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) ద్వితీయ త్రైమాసికానికి (జూలై-సెప్టెంబర్)గాను వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు ప్రకటించే ఆర్థిక ఫలితాలు కీలకం కానున్నాయి. దేశీయ ఐటీ రంగ సంస్థలు ఆశాజనక ఫలితాలను నమోదు చేస్తుండటం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరుస్తున్నది. అయితే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటనలు, నిర్ణయాలు కొంత మేర అమ్మకాల ఒత్తిడికి దారితీస్తున్నాయి.

అయినప్పటికీ అంతర్జాతీయ మార్కెట్‌లో దిగొస్తున్న ముడి చమురు ధరలు, ఫారెక్స్ మార్కెట్‌లో డాలర్‌తో పోల్చితే బలపడుతున్న రూపాయి మారకం విలువ.. స్టాక్ మార్కెట్లలో కొనుగోళ్లకు మద్దతిచ్చే వీలుందనే చెప్పవచ్చు. కానీ పశ్చిమాసియా సంక్షోభంతో క్రూడాయిల్ రేట్లు ఇంకా పెరిగితే సూచీలు నష్టాలకు లోనుకావచ్చు. తగ్గితే మదుపర్లు పెట్టుబడులకు మొగ్గుచూపుతారు. విదేశీ మదుపర్ల పెట్టుబడులు, అంతర్జాతీయ మార్కెట్ల తీరుతెన్నులు, ఎల్ నినో సంబంధిత సమాచారం కూడా మార్కెట్ కదలికల్ని ప్రభావితం చేయగలవు. ముఖ్యంగా ద్రవ్యోల్బణం.. మార్కెట్ పెట్టుబడులను గట్టిగానే ప్రభావితం చేయగలవని చెప్పవచ్చు. ఇక అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 22,800 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,600 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,400-23,600 పాయింట్ల స్థాయికి వెళ్లవచ్చని కూడా మెజారిటీ ఎక్స్‌పర్ట్స్ చెప్తున్నారు.

గమనిక..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదుడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న వివరాలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

బంగారం మళ్లీ ఆల్‌టైమ్ హై..? వచ్చే రెండేండ్లలో చేరవచ్చన్న అంచనాలు



న్యూఢిల్లీ : సెంట్రల్ బ్యాంకులు తమ పసిడి కొనుగోళ్లను పెంచడం, ప్రభుత్వ అప్పుల భారంపై ఆందోళనలు, భౌగోళిక-రాజకీయ ఉద్రిక్తతలు, కరెన్సీ మార్కెట్‌లో డాలర్‌కు ఆటుపోట్లు.. పుత్తడికి మళ్లీ పూర్వ వైభవాన్ని తీసుకొస్తాయన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి మరి. నిజానికి ఇప్పుడు మార్కెట్‌లో గోల్డ్ రేట్లు పతనం దిశగా వెళ్తున్నాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ రాబోయే ద్రవ్య సమీక్షల్లో వడ్డీరేట్లను పెంచుతుందన్న అంచనాల మధ్య ఈ వారంలో ఒక్కరోజే పసిడి రేటు 2 శాతం దిగజారి ఔన్సు 4,075 డాలర్లకు క్షీణించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు విజృంభిస్తుండటంతో ద్రవ్యోల్బణం భయాలు వెంటాడుతున్నాయి. దీంతో ఫెడ్ వడ్డీరేట్లు పెరిగితే డాలర్లకు డిమాండ్ పెరుగడం, బాండ్లపై రాబడులు ఆకర్షణీయంగా మారడం జరిగిపోతాయి. ఫలితంగా మదుపర్లు తమ పెట్టుబడులను సహజంగానే గోల్డ్ నుంచి ఉపసంహరించుకుంటారు. ఇదే.. పుత్తడి ధరల క్షీణతకు దారితీస్తున్నది. అయితే మార్కెట్‌లో తీవ్ర ఒడిదుడుకుల కారణంగా ఇన్వెస్టర్లు తమ పెట్టుబడుల రక్షణార్థం బంగారం వైపునకే చూస్తారని, అందుకే రేట్లు తిరిగి దూసుకుపోవడం ఖాయమన్న అభిప్రాయాలను ఫండ్ మేనేజర్లు వెలిబుచ్చుతున్నారు. ఈ క్రమంలోనే రాబోయే 12-18 నెలల్లో గోల్డ్ రేటు కొత్త రికార్డ్ హైని తాకగలదని ట్రాయ్ అసెట్ మేనేజ్‌మెంట్ ఫండ్ మేనేజర్ చర్లొట్టె యంగ్ అంటున్నారు. అమెరికా-ఇరాన్ యుద్ధం, రష్యా-ఉక్రెయిన్ వార్, ట్రంప్ దుందుడుకు నిర్ణయాలు.. ప్రపంచ మార్కెట్లలో స్థిరత్వాన్ని లోపింపజేస్తాయని ఎక్స్‌పర్ట్స్ అంచనా వేస్తున్నారు.

షఫాలీ సునామీ.. స్మృతి మంధాన మెరుపు ఫినిషింగ్

8.5 ఓవర్లలోనే జింబాబ్వేపై టీమిండియా విధ్వంసం!

జింబాబ్వేతో రెండో టీ20లో భారత మహిళల జట్టు అదరగొట్టింది. తొలుత బౌలింగ్‌లో ప్రత్యర్థిని కట్టడి చేసిన టీమిండియా.. ఆ తర్వాత బ్యాటింగ్‌లో విధ్వంసం సృష్టించింది. ఓపెనర్లు షఫాలీ వర్మ, స్మృతి మంధాన ఆకాశమే హద్దుగా చెలరేగడంతో స్వల్ప లక్ష్యాన్ని భారత్ కేవలం 8.5 ఓవర్లలోనే ఛేదించింది. షఫాలీ వర్మ 25 బంతుల్లో 55 పరుగులతో విరుచుకుపడగా.. కెప్టెన్ స్మృతి మంధాన 23 బంతుల్లో 40 పరుగులతో మెరిపించింది.

బౌలింగ్‌లో కట్టడి.. 100 పరుగులకే జింబాబ్వే పరిమితం

మొదట బ్యాటింగ్ చేసిన జింబాబ్వే మహిళల జట్టు భారత బౌలర్ల ధాటికి నిర్ణీత 20 ఓవర్లలో సుమారు 100 పరుగులకే పరిమితమైంది. ఆ జట్టు బ్యాటర్లలో చిపో ముగేరి-తిరిపానో 32 బంతుల్లో 34 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచింది. జోసెఫిన్ న్కోమో 29 బంతుల్లో 24 పరుగులతో పోరాడింది. అయితే మిగతా బ్యాటర్లు భారీ స్కోరు చేయడంలో విఫలమయ్యారు. భారత బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ జింబాబ్వేను ఒత్తిడిలోకి నెట్టారు. దీప్తి శర్మ బెలవ్డ్ బిజాను ఔట్ చేయగా.. నందిని శర్మ కూడా వికెట్ సాధించింది. యువ క్రికెటర్ నికి ప్రసాద్ తన అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి బంతికే వికెట్ తీసి ఆకట్టుకుంది. చిపో ముగేరి-తిరిపానోను రిచా ఘోష్ క్యాచ్ పట్టడంతో నికి ప్రసాద్‌కు తొలి వికెట్ దక్కింది. అనంతరం నికి ప్రసాద్ మరో వికెట్ సాధించడంతో జింబాబ్వే ఇన్నింగ్స్ మరింత ఒత్తిడిలో పడింది. భారత ఫీల్డర్లు కూడా కీలక పాత్ర పోషించారు. రనౌట్‌తో పాటు క్యాచ్‌ల ద్వారా జింబాబ్వే బ్యాటర్లను పెవిలియన్‌కు పంపారు. దీంతో జింబాబ్వే భారత్ ముందు కేవలం 103 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని మాత్రమే ఉంచగలిగింది.

ఆరంభం నుంచే షఫాలీ దూకుడు

స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు షఫాలీ వర్మ, స్మృతి మంధాన అదిరిపోయే ఆరంభాన్ని అందించారు. తొలి ఓవర్ నుంచే షఫాలీ బౌండరీలతో విరుచుకుపడింది. ఆరంభంలోనే



ఫోర్, సిక్స్‌తో జింబాబ్వే బౌలర్లపై ఒత్తిడి పెంచింది. మరోవైపు మంధాన ఆచితూచి ఆడుతూ వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదింది. రెండో ఓవర్‌లో మంధాన వరుసగా రెండు ఫోర్లు కొట్టగా.. ఆ తర్వాత షఫాలీ కూడా తనదైన శైలిలో దూకుడు కొనసాగించింది. మూడో ఓవర్‌లో సిక్స్ బాదిన షఫాలీ.. నాలుగో ఓవర్‌లోనూ బౌండరీతో సత్తా చాటింది. ఈ క్రమంలో ఇద్దరి మధ్య భాగస్వామ్యం వేగంగా పెరిగింది. నాలుగో ఓవర్‌లో మంధాన వరుసగా నాలుగు ఫోర్లు బాదడంతో భారత స్కోరు ఒక్కసారిగా ఊపందుకుంది. ఐదో ఓవర్‌లో షఫాలీ వర్మ వరుస బౌండరీలతో విరుచుకుపడింది. ఆ ఓవర్‌లో నాలుగు ఫోర్లు సహా 21 పరుగులు రావడంతో జింబాబ్వే బౌలర్లు ఒత్తిడికి గురయ్యారు. పవర్‌ప్లే ముగిసే సమయానికి భారత్ వికెట్ నష్టపోకుండా 76 పరుగులు చేసింది. టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి ఆరు ఓవర్లలో భారత్ సాధించిన అత్యధిక స్కోర్లలో ఈ ప్రదర్శన కూడా చోటు దక్కించుకుంది. జింబాబ్వే బౌలర్లకు ఎక్కడా అవకాశం ఇవ్వకుండా షఫాలీ, మంధాన పరుగుల వరద పారించారు.

24 బంతుల్లోనే షఫాలీ అర్ధశతకం

షఫాలీ వర్మ తన విధ్వంసక బ్యాటింగ్‌తో ప్రేక్షకులను అలరించింది. బౌలర్ ఎవరన్నది పట్టించుకోకుండా బంతిని బౌండరీ దాటించడమే లక్ష్యంగా ఆడింది. ఏడో ఓవర్‌లో సిక్స్ బాది కేవలం 24 బంతుల్లోనే అర్ధశతకాన్ని పూర్తి చేసింది. ఆ వెంటనే మరో సిక్స్ కొట్టి జట్టును విజయానికి మరింత చేరువ చేసింది. చివరకు 25 బంతుల్లో 55 పరుగులు చేసిన షఫాలీ.. ఆరు ఫోర్లు, నాలుగు సిక్సర్లతో ఆకట్టుకుంది. బెలవ్డ్ బిజా బౌలింగ్‌లో లాంగ్‌ఆన్‌లో క్యాచ్ ఇవ్వడంతో ఆమె ఇన్నింగ్స్ ముగిసింది. అప్పటికే భారత్ విజయం దాదాపు ఖాయమైంది. షఫాలీ ఔటైన తర్వాత క్రీజులోకి వచ్చిన అనుష్క శర్మతో కలిసి మంధాన లక్ష్యాన్ని పూర్తి చేసింది. మంధాన తన దూకుడును కొనసాగిస్తూ 23 బంతుల్లో 40 పరుగులు సాధించింది. ఆమె ఇన్నింగ్స్‌లో ఫోర్లు, సిక్సర్లతో పాటు చక్కటి టైమింగ్ కనిపించింది. చివరికి ఒలిండర్ చారే బౌలింగ్‌లో భారీ సిక్సర్ బాది మంధాన మ్యాచ్‌ను ముగించింది.

స్పోర్ట్స్

తొలి రోజే ఆంధ్ర ఆధిపత్యం..

275 పరుగులకే హైదరాబాద్ ఆలౌట్


లంచ్ తర్వాత విజృంభించిన ఆంధ్ర బౌలర్లు

త్రిపురణ విజయ్‌కు నాలుగు వికెట్లు

విజయవాడ స్పోర్ట్స్, మహానగర్



రంజీ ట్రోఫీలో భాగంగా మూలపాడులో ఆంధ్ర, హైదరాబాద్ జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్‌లో తొలి రోజే ఆంధ్ర బౌలర్లు ఆధిపత్యం ప్రదర్శించారు. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న హైదరాబాద్ జట్టు 86 ఓవర్లలో 275 పరుగులకు ఆలౌట్ అయింది. అనంతరం తొలి రోజు ఆట ముగిసే సమయానికి ఆంధ్ర జట్టు రెండు ఓవర్లలో వికెట్ నష్టపోకుండా తొమ్మిది పరుగులు చేసింది. లంచ్ విరామం వరకు ఒక వికెట్ నష్టానికి 119 పరుగులతో పటిష్టంగా కనిపించిన హైదరాబాద్ జట్టును ఆ తర్వాత ఆంధ్ర బౌలర్లు కట్టడి చేశారు. హైదరాబాద్ ఓపెనర్ అభిరత్ రెడ్డి 108 బంతుల్లో ఎనిమిది ఫోర్లు, ఒక సిక్సర్‌తో 67 పరుగులు చేయగా, తన్మయ్ అగర్వాల్ 75 బంతుల్లో నాలుగు ఫోర్లతో 42 పరుగులు సాధించాడు. మిడిల్ ఆర్డర్‌లో రాహుల్ రాదేష్ 105 బంతుల్లో ఐదు ఫోర్లు, ఒక సిక్సర్‌తో 58 పరుగులు చేసి జట్టుకు అండగా నిలిచాడు. మిగిలిన బ్యాటర్లు పెద్దగా రాణించలేకపోయారు. ఆంధ్ర బౌలర్ త్రిపురణ విజయ్ నాలుగు వికెట్లు పడగొట్టగా, సౌరభ్ కుమార్, లలిత్ మోహన్ చెరో మూడు వికెట్లు తీసి హైదరాబాద్ బ్యాటింగ్‌ను దెబ్బతీశారు. లంచ్ తర్వాత క్రమశిక్షణతో బౌలింగ్ చేస్తూ వరుస వికెట్లు సాధించిన ఆంధ్ర జట్టు తొలి రోజే మ్యాచ్‌పై పట్టు సాధించింది. రెండో రోజు ఆంధ్ర బ్యాటర్లు ఎలా రాణిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.



అమెరికాలో హిస్టారికల్ వరల్డ్ ప్రీమియర్

దేశమంతా ఎదురు చూస్తున్న పాన్ ఇండియా పౌరాణిక దృశ్యకావ్యం 'రామాయణ'. నితీశ్ తివారీ రూపొందిస్తున్న ఈ వెండితెర ఇతిహాసంలో సీతారాములుగా సాయిపల్లవి, రణబీర్‌కపూర్ నటిస్తున్న విషయం తెలిసిందే. దాదాపుగా మూడువేల కోట్ల నిర్మాణ వ్యయంతో రెండు భాగాలుగా నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్న ఈ ఫ్రాంచైజీలోని తొలి భాగం దీపావళి కానుకగా నవంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా హిందీ, తెలుగు, కన్నడ, తమిళం, మలయాళ భాషల్లో విడుదల కానున్నది. ఈ నేపథ్యంలో మేకర్స్ వరల్డ్ ప్రీమియర్‌కు సిద్ధమవుతున్నారు. ఈ నెల 27న సాయంత్రం అమెరికా లాస్ ఎంజెల్స్‌లోని అకాడమీ మ్యూజియం ఆఫ్ మోషన్ పిక్చర్స్‌లో ఉన్న డేవిడ్ గెఫెన్ థియేటర్‌లో ఈ సినిమా వరల్డ్ ప్రీమియర్ జరుగనున్నది. ఆహ్వానం ఉన్నవారికి మాత్రమే ప్రవేశం కల్పించే ఈ ప్రీమియర్‌కు హాలీవుడ్ ప్రముఖుల, దర్శకులు, అంతర్జాతీయ మీడియా ప్రతినిధులు, పలువురు ప్రపంచ సినీ ప్రముఖులు హాజరుకానున్నారు. ఎన్నో అంతర్జాతీయ కార్యక్రమాలకు, ఆస్కార్ వేడుకలకు వేదికగా నిలిచిన అకాడమీ మ్యూజియంలో 'రామాయణ' ప్రీమియర్ జరుగనుండటం భారతీయ సినీచరిత్రలోనే సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ ఘట్టమని మేకర్స్ చెబుతున్నారు. 945మంది ప్రేక్షకులు కూర్చునే సామర్థ్యం ఉన్న ఈ థియేటర్‌లో 3డీ ఫార్మాట్‌లో ఈ సినిమా స్క్రీనింగ్ జరుగనున్నది. ఇక ఈ ఫ్రాంచైజీకి చెందిన రెండో భాగం వచ్చే ఏడాది దీపావళికి రానున్న విషయం తెలిసిందే.

రివార్డులతోపాటు అవార్డులూ సాధించే సినిమా



నరేశ్ వీకే, అనుపమ పరమేశ్వరన్, తరుణ్‌భాస్కర్, అఖిల్ ఉడ్డెమారి ప్రధాన పాత్రధారులుగా రూపొందిన ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'క్రేజీ కల్యాణం'. బద్రప్ప గాజుల దర్శకుడు. బూసం జగన్‌మోహన్‌రెడ్డి నిర్మాత. ఇటీవలే విడుదలైన ఈ సినిమా థియేటర్లలో ప్రదర్శితమవుతున్నది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో ఈ సినిమా సక్సెస్‌మీట్‌ని నిర్వహించారు. చిత్ర కథానాయిక అనుపమ పరమేశ్వరన్ మాట్లాడుతూ 'ఆడియన్స్ రెస్పాన్స్ అద్భుతంగా ఉంది. గట్స్, ప్యాషన్ ఉన్న ఇలాంటి టీమ్ ఉంటేనే, ఈ తరహా విజయాలు సాధ్యమవుతాయి. నేను కమర్షియల్ సినిమాలతోపాటు కంటెంట్ ఓరియెంటెడ్ సినిమాలు కూడా చేస్తుండటం వల్ల ప్రేక్షకులకు వినోదంతో పాటు మంచి సందేశం కూడా ఇవ్వగలుతున్నా. వినోదం, సందేశం రెండూ ఉన్న సినిమా 'క్రేజీకల్యాణం" అని పేర్కొన్నారు. దసరా పండక్కి రక్తపాతాలతో కూడిన సినిమాలతోపాటు రక్తసంబంధాల కథల్ని కూడా చూస్తామని ప్రేక్షకులు రుజువు చేశారని, భావోద్వేగాలతో ప్రతి తెలుగువాడినీ కలిపే సినిమా ఇదని, రివార్డ్‌తోపాటు ఈ సినిమా అవార్డులను కూడా సాధిస్తుందని అగ్రనటుడు నరేశ్ వీకే నమ్మకం వెలిబుచ్చారు. ఇంకా చిత్రబృందమంతా మాట్లాడారు.

హానెస్ట్‌గా తీసిన గ్లోబల్ సినిమా 'కల్ట్'



'మొదటి అయిదు నిమిషాలకే ప్రేక్షకులను కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్లే సినిమా ఇది. ఇదో గ్లోబల్ కంటెంట్. అందుకే ఈ సినిమాను జపనీస్,స్పానిష్ భాషల్లో కూడా డబ్ చేశాం. ఇది భాషను దాటి వెళ్లే సినిమా. రెండు గంటల 20 నిమిషాల పాటు ఇంటెన్స్ డ్రామా ఉంటుంది. యాక్షన్ కంటే ఆడియన్స్ డ్రామాకు కనెక్టవుతారు. నేను ఎక్స్‌పెరిమెంట్ చేసిన ప్రతిసారీ ఆడియన్స్ కనెక్ట్ అయ్యారు. ఇందులో ఎలాంటి ఈక్వేషన్స్, క్యాలిక్యులేషన్స్ ఉండవు. చాలా హానెస్ట్‌గా ఈసినిమా చేశాం. ఇందులో 150మంది ప్రొఫెషనల్ యాక్టర్స్ ఉన్నారు. వారంతా కేవలం నా కోసం ఈ సినిమాలో భాగమయ్యారు. నటుడిగానే కాక, దర్శకునిగా కూడా నాకు సంతృప్తిని ఇచ్చిన సినిమా 'కల్ట్" అని విశ్వక్‌సేన్ అన్నారు. ఆయన నటిస్తూ స్వీయ దర్శకత్వం వహించిన సినిమా 'కల్ట్'. సందీప్ కాకరాల నిర్మాత. ఈ నెల 30న సినిమా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో విశ్వక్‌సేన్ మాట్లాడారు. ఇంకా నిర్మాత సందీప్ కాకరాల, యాక్టర్ ఈజీ, అనిరుధ్, కార్తికేయ, తారక్ పొన్నప్ప కూడా మాట్లాడారు. గోవాలోని ఒక నిర్మానుష్య ఐలాండ్ ఎస్టేట్‌లో 300మందికి పైగా చిక్కుకుపోవడంతో ట్రైలర్ మొదలైంది. ఆద్యంతం ఉత్కంఠభరితంగా ట్రైలర్ సాగింది. ట్రైలర్‌లో విశ్వక్ పాత్ర విభిన్న కోణాల్లో కనిపించింది. వాస్తవంగా జరిగిన భయానక సంఘటనల స్ఫూర్తితో రూపొందిన తొలి ఇండియన్ స్లాషర్ థ్రిల్లర్ ఇదని మేకర్స్ చెబుతున్నారు.



షూటింగ్ పూర్తి



మెగా హీరో సాయిదుర్గతేజ్ నటిస్తున్న యాక్షన్ అడ్వెంచర్ 'సంబరాల ఏటి గట్టు' రోహిత్ కేపీ దర్శకత్వంలో ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కె.నిరంజన్‌రెడ్డి, చైతన్యరెడ్డి నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం షూటింగ్ విజయవంతంగా పూర్తయింది. ఈ విషయాన్ని తెలియజేస్తూ ఆదివారం మేకర్స్ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా విడుదల చేసిన 'బిహైండ్ ది సీన్స్' వీడియోలో ఈ సినిమా కోసం వేసిన భారీ సెట్స్‌ని, కొన్ని రా యాక్షన్ సన్నివేశాలతోపాటు టీమ్ మధ్య ఉన్న ఎమోషనల్ బాండింగ్‌ని కూడా చూపించారు. పదికి పైగా భారీ షెడ్యూల్స్‌తో 160 రోజులకు పైగా షూటింగ్ జరిపామని, సాయిదుర్గతేజ్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ మూవీగా 'సంబరాల ఏటిగట్టు' నిలుస్తుందని మేకర్స్ తెలిపారు. షూటింగ్ పూర్తయిన సందర్భంగా యూనిట్ మొత్తానికీ కృతజ్ఞతలు తెలుపుతూ, టీమ్‌తో కలిసి హీరో సాయిదుర్గతేజ్ సంబరాల్లో పాల్గొన్నారు. సంక్రాంతి కానుకగా జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న ఈ చిత్రంలో కన్నడ నటుడు ధనంజయ, ఐశ్వర్యలక్ష్మి, జగపతిబాబు, నరేష్ వీకే, సాయికుమార్, శ్రీకాంత్ మేక, అనన్య నాగళ్ల ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: వెట్రి పళనిసామి, సంగీతం: బి.అజనీష్ లోక్‌నాథ్.

ఈనెల 30న జ్యోతి పూర్వాజ్ "కిల్లర్" రిలీజ్

జ్యోతి పూర్వాజ్, పూర్వాజ్ ప్రధాన పాత్రలు చేసిన సై ఫై థ్రిల్లర్ సినిమా "కిల్లర్". మనీష్ గిలాడా, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రల్లో నటిస్తున్నారు. పూర్వాజ్ , పద్మనాభ రెడ్డి.ఏ నిర్మిస్తున్నారు. పూర్వాజ్ దర్శకత్వం వహించాడు. ఈ నెల 30న థియేటర్లలో మూవీ రిలీజ్ కానుంది. ఈ నెల 21న ఈ సినిమా ట్రైలర్ రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఓవర్సీస్‌లోనూ "కిల్లర్" మూవీ గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఓఎంజి పిక్చర్స్ ఈ సినిమాను ఓవర్సీస్ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. ఈ సంస్థ "కిల్లర్" సినిమాను అమెరికా, యూరప్, కెనడా, అరబ్ దేశాలు, మలేషియా, న్యూజిలాండ్, రష్యా వంటి దేశాల్లో విడుదల చేయనుంది.

PRINTED AND PUBLISHED BY MUPPIRISETTY JAGADEESH, On behalf of CATERWEALTH MEDIA LLP, PRINTED at M/S. SREE SESHASAI ENTERPRISES, D.NO. NEW. 3-88, OLD. 3-22, GOSALA, CHANDRA THEATER ROAD, PENAMALURU-521151, KRISHNA DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT CATERWEALTH MEDIA LLP, 3RD FLOOR, 59-12-9A, FIRST LINE, GAYATHRI NAGAR, VIJAYAWADA, NTR DISTRICT, ANDHRA PRADESH. EDITOR: MUPPIRISETTY JAGADEESH. RNI REGD NO. APTEL/2016/70247, Email I D : mahanagarap@gmail.com Phone : 9044417999